తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50





గురువారం కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో భేటీ అయిన మంత్రి లోకేష్

# పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో మంత్రి లోకేష్ భేటీ

## సిఎంకు ఎపి సంక్షేమ పథకాల అమలు, టెక్నాలజీ వినియోగం, పెట్టుబడుల సాధనను వివరించిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ బంధం మరింత బలోపేతం కావాలని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.గురువారం సాయంత్రం తరువాత కొల్‌కత్తాకు లోకేష్ చేరుకున్నారు.ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కోల్ కతాలోనే ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంగళగిరి చేనేత శాలువాతో సిఎంను లోకేష్ సత్కరించారు. ఎపిలో అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం గురించి లోకేష్ వివరించారు.
దేశంలోనే ఏ రాష్ట్రంలో ఇవ్వనటువంటి గరిష్ట ప్రయోజనంతో కూడిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందజేస్తున్న ఏపీ ప్రభుత్వ మెకానిజం సీఎంకు వివరించారు. పశ్చిమ బెంగాల్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును సిఎంను అడిగి తెలుసుకున్నారు. ఏపీలో అమలవుతున్న డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ఫలితాలను సిఎంకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని కోరారు. పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సీఎంకు విన్నవించారు. మత్స్య సంపద పెంపు, ఎగుమతుల విషయంలో పరస్పర సహకారంతో మరింత అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనలపై పశ్చిమ బెంగాల్ సిఎం సానుకూలంగా స్పందించారు.

# హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

>> బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?' అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపిని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని హైకోర్టు సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా?, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా? అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని అన్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి న్యాయస్థానం ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, ఈ కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

# చారిత్రాత్మక ఎఫ్‌టిఎ

>> చెప్పారు. ఈ యేడాది ఫ్రాన్స్ ఒక కీలక వారధిగా మారి, భారత్ మరియు యూరప్ టెక్ ఎకోసిస్టమ్‌లను మరింత దగ్గర చేస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ సహకారం వంటి రంగాల్లో భారత్‌ఫ్రాన్స్ భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ వివాటెక్ 10వ ఎడిషన్‌లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సదస్సుగా పేరుగాంచిన వివాటెక్ విజయవంతంగా నిర్వహించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తోపాటు నిర్వాహకులను మోడీ అభినందించారు.

# లూటీపై ఇడి విచారణ

>> యార్డుల్లో 64లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ ఉంచామని స్పష్టంచేశారు. అక్రమ మైనింగ్‌కు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు ఐఐటి ధన్‌బాద్‌కు చెందిన 'టచ్‌మిల్ ఫౌండేషన్'తో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం చేసుకున్నామని, ఇకపై మైనింగ్ క్వారీలను డ్రోన్లు,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా గగనతలం నుంచి నిరంతరం నిఘా పెడతామని మంత్రి వెల్లడించారు. కర్నూలు జిల్లా జొన్నగిరి (తుగ్గలి మండలం)లో జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక బంగారు గని ప్రాజెక్టును త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించబోతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. దీనితో పాటు చిత్తూరు జిల్లా చిగురుకుంట పరిసర ప్రాంతాల్లో బంగారం, ఇనుము, మాంగనీస్ నిల్వలున్న 17కొత్త మేజర్ బ్లాకులను ఐడెంటిఫై చేశామని, కావలికుల ఏరియాలో 1000హెక్టార్ల పరిధిలో జి-2 లెవల్ ఖనిజాన్వేషణకు ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధి ఫలాలు

>> యంపై ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. అలాగే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు.. విద్యుత్ సరఫరా అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ఈ ఏడాది డిమాండ్‌లో 17 శాతం వృద్ధి నమోదైంది. ఐటి, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఎంత అవసరం అవుతుందో అంచనాలు తయారు చేయాలి. సోలార్ విండ్, పంప్డ్ స్టోరేజితో పాటు బిఇఎస్ఎస్ టెక్నాలజీకే ఇక భవిష్యత్తు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీకి అనుగుణంగా పంప్డ్ స్టోరేజి సహా ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు చేపట్టాలి. లీథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇవిలకు ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీలపై దృష్టి పెట్టాలి. బ్యాటరీ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టండి. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ వినియోగం అనేది అత్యంత కీలకం. డేటా సెంటర్ల అనుమతుల విషయంలో దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. సెమీ కండక్టర్లపై ఎక్కువ దృష్టి సారించాలి. దానికి సంబంధించిన ఎకోసిస్టంపై ఎక్కువ ఫోకస్ చేద్దాం. ఇక మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ కంపెనీలను ఎంకరేజ్ చేద్దాం. అమరావతిలో ఎఐ, ఆల్గారిథమ్స్ క్వాంటం అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివి సులభతరంగా అందించాలి.అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఓ ఎకోసిస్టమ్ రావాలి. టవర్లతో పాటు టెక్నాలజీ పార్క్ రావాలి. క్వాంటం అప్లికేషన్లతో పాటు క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా రావాలి. మరోవైపు ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి, శ్రీసిటీలు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇసుజు, హీరో లాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. అనంతపురంలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోంది. పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రం వేగంగా గ్రౌండ్ కావాలి. ఫైటర్ జెట్ తయారీ కేంద్రం పనుల విషయంలో నిరంతరం ఫాలో అప్ చేస్తూ ఉండాలి. కేంద్రానికీ ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలి. ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కారం చూపాలి. బెంగళూరు- పుట్టపర్తి డిఫెన్స్ కారిడార్‌గా మారుతుంది. ఏరోస్పేస్ కారిడార్‌గా ఈ ప్రాంతాన్ని మార్చాలి. తాడిపత్రి-అనంతపూర్ మధ్య ఓ ఎయిర్ స్ట్రిప్ వచ్చేలా చూడాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.

**జొన్నగిరి... స్వర్ణగిరి:**

"పర్యాటకులు ఎక్కువ సమయం రాష్ట్రంలో గడిపేలా హోటళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. మహీంద్రా క్లబ్ సంస్థ బీచ్ రిసార్ట్స్, పులికాట్ లేక్ వద్ద కూడా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. అరకు లాంటి ప్రాంతాల్లోనూ ఐటిడిఎ భాగస్వామ్యంతో మహీంద్రా ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. టెంపుల్ టూరిజంను ప్రోత్సహించేలా కొత్తగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను గుర్తించి వాటి వద్ద పెట్టుబడులు వచ్చేలా చూడాలి. తిరుపతి, అమరావతి, విశాఖలలో బాబా రామ్‌దేవ్ యోగా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గండికోట, పోలవరం ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలు వద్ద పెద్ద ఎత్తున హోటళ్లు రావాల్సి ఉంది. హార్సిలీ హిల్స్ వద్ద మంచి రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టులు మరింతగా పెరుగుతారు. సూర్యలంక బీచ్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. బెస్ట్ బీచ్ టూరిజం స్పాట్‌గా సూర్యలంకను తీర్చిదిద్దాలి. పర్యాటక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు చేపట్టాలి. అమరావతిలో వచ్చే పెట్టుబడులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఓ కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. డిస్ట్రిక్ట్ కూలింగ్, పైప్డ్ గ్యాస్, విద్యుత్ లాంటివి పూల్‌గా ఇచ్చే పరిస్థితి వస్తే ప్రాజెక్టుల వ్యయం తగ్గుతుంది. రేర్ ఎర్త్ మినరల్స్‌కు ఎపి కేంద్రంగా మారాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించిన ఎండ్ టూ ఎండ్ సొల్యూషన్స్ ఎపిలో అందుబాటులో ఉండేలా ఎకోసిస్టమ్ రావాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌పై ఓ ప్రత్యేక విద్యా సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందేమో ఆలోచన చేయాలి. జొన్నగిరి గోల్డ్ మైన్ 1000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. జొన్నగిరి అత్యంత పురాతన చరిత్ర ఉంది. ఒకప్పుడు జొన్నగిరికి స్వర్ణగిరి అని పేరుంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలి. విశాఖ నగరంలో ప్రస్తుత సదుపాయాలను మరింత మెరుగు పరుస్తూనే శాటిలైట్ టౌన్ షిప్‌లు అభివృద్ధి జరిగేలా చూడాలి. పరిశ్రమలతో పాటు.. హౌసింగ్ కూడా ఉండాలి. పారిశ్రామిక ప్రాంతాల వద్ద అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు జరిగేలా చూడాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రాజెక్టు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్**

ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు, మినహాయింపులను అమలు చేయాలని ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ సూచించారు. భూ కేటాయింపులు జరిగిన తర్వాత వేగంగా ప్రాజెక్టులు ప్రారంభం కావాలి... అప్పుడే జిఎస్‌టి సహా వివిధ మార్గాల ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇక ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్థానిక పరిశ్రమలతో మ్యాపింగ్ చేసి దానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుతున్నామని లోకేష్ వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్ పరిశోధనపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇటీవల చేపట్టిన రష్యా పర్యటనలో తాను గమనించిన అంశాలను లోకేష్ ప్రస్తావించారు. రష్యాలో క్వాంటం అప్లికేషన్లకు సంబంధించి ఓ ప్రత్యేకమైన ఎకోసిస్టమ్ ఏర్పాటై ఉందని లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని, టిజి భరత్, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్, బిసి జనార్దన్ రెడ్డి, సిఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

>> నది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'విబి జి రామ్ జి' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి:**

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు డిప్యూటీ సిఎం పవన్‌కి తెలియజేశారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు.
ఈ ప్రణాళికపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, "సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి" అని సూచించారు.

**అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు:**

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షి ంచేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రీకమ్' అని నామకరణం చేశారు.
ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల డిప్యూటీ సిఎం పవన్ అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలుసుకొని అభినందించారు. ఈ సమావేశంలో అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, పిసిసిఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సిసిఎఫ్ సోషల్ ఫారెస్ట్, జూలాజికల్ పార్క్స్ బి.ఎన్.ఎన్. మూర్తి, సిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ మాతో వస్తే మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తా

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్18(ప్రభాతవార్త):** ప్రధాని మోడీ చలువ సిఎం చంద్రబాబు చొరవ తోనే రాష్ట్రానికి రెండేళ్లలోనే ఎన్నడు లేని విధంగా 10 లక్షల కోట్ల రూపాయలు నిధులు వచ్చాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పష్టం చేశారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బిజెపి అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులు కేంద్రం 35 వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని, విశాఖ రైల్వే జోన్ ప్రధాని ప్రధాని సాధ్యం చేశారని గుర్తు చేశారు. జగన్, షర్మిల పాదయాత్ర చేసి ఈ అభివృద్ధిని చూసుకోవాలని ఎద్దేవా చేశారు డీఎస్సీ పోస్టుపై అధికారులు వివరణ ఇచ్చిన జగన్ ఫ్రెస్టేషన్లో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.
పేదల సంక్షేమానికి 160కిపైగా పథకాలను ప్రధాని మోడీ ప్రవేశపెట్టారన్నారు. పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా పొదుపు, బీమా పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేవలం రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ప్రమాద బీమా కల్పించారని, డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు.
అమరావతి నిర్మాణానికే కేంద్రం రూ.30 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. జగన్ మాతో వస్తే , మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తామని మాధవ్ అన్నారు. ఫ్రస్టేషన్, సెన్సేషన్ కోసమే జగన్ కొత్త నాటకాలని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగిందని మాధవ్ స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

19-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
పంచమి సా.5.06,
ఆశ్లేష ఉ.10.10
వర్జ్యం : రా.9.49-రా.11.23
దు.ఉ.8.12-ఉ.9.04, 2)మ.12.35-మ.1.27
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**వృషభం:** సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.వస్త్రలాభం.

**మిథునం:** వృత్తిలో మెలకువలు అవసరం. వాతావరణంలో స్వల్ప మార్పుల వలన ఆరోగ్యం మీద కొంతమేర ప్రభావం ఉంటుంది.

**కర్కాటకం:** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోను చేస్తుంది.ఆస్తి వివాదాలు.

**సింహం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలం.

**కన్య :** ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది. నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు.

**తుల :** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు కీలకమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ప్రతి వాతావరణంలో కొన్ని అనుకూలంగా ఫలితాలు సాధిస్తారు. మీ వైరి వర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఓర్పు నేర్పులతో మందకొండిగా సాగుతున్న వ్యవహారాలలో కొంత పురోభివృద్ధి సాధిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** కార్యాలయంపై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసుకోవడంలో వైఫల్యం చెందుతారు.బంధువుల కలయిక.

**మీనం:** సెల్ఫ్ డ్రైవింగ్ సాధ్యమైనంత వరకు చేయకపోవడం ఉత్తమం. ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



వారణాసిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం నమామి గంగే సభ్యులు గంగానదిలో 'జలయోగా' చేస్తున్న దృశ్యం

# అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

>> భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు.
ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెం.1 స్థానంలో ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మంత్రి లోకేష్ అభినందించారు. కడప మోడల్‌లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పిటిఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కెజిబివిల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కెజిబివిలతో పాటు ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.

**జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కిట్స్ పంపిణీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు మంత్రి లోకేష్ చెప్పారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

**తెలుగు అకాడమీ పుస్తకాలు ఇక ఆన్‌లైన్‌లో:**

తెలుగు అకాడమీ ముద్రించే టెక్స్ట్ బుక్స్ ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్ ద్వారా విక్రయించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరుపై ప్రత్యేక దృష్టి:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు వారి హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం తదితర జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆయా జిల్లాలలో ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పాఠశాల హాజరు 95శాతానికి తగ్గకుండా పక్కా చర్యలు తీసుకోవాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మాతృభాషను విస్మరించొద్దు**

పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల్లో అధికశాతం మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్న విషయాన్ని అధికారులు మంత్రి లోకేష్‌దృష్టికి తెచ్చారు. "ఎట్టిపరిస్థితుల్లో మాతృభాష తెలుగును విస్మరించొద్దు, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయండి, ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి విద్యార్థులకు అందజేయాలి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఇప్పటినుంచే వారికి అదనపు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలి" అని అధికారులకు మంత్రి లోకేష్ సూచించారు.

# అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

>> ఆమోదం తెలపడంతో ఈ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఈ చారిత్రాత్మక ఒప్పందం అంత సులభంగా సాధ్యపడలేదు. కొన్ని నెలలుగా ఒమన్ తో ఇతరదేశాలు నేతృత్వంలో తెరవెనుక తీవ్రమైన దౌత్య సంప్రదింపులు జరిగాయి.పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న తరుణంలో, ఇరు దేశాలు పట్టువిడుపులకు వెళ్లకుండా ఒప్పందానికి ముందుకు వచ్చాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పం దంలో ఇరు దేశాలు అంతర్జాతీయ శాంతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందానికి అంగీకరించాయి. లెబనాన్ సరిహద్దులతో సహా పశ్చిమాసియాలోని అన్ని ప్రాంతాలలో ఇరు దేశాలకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష సైనిక చర్యలు, దాడులను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య కూడా ఒక సంధి జరగనుంది. కొంతకాలంగా ఉద్రిక్తతలకు కేంద్రంగా మారి, అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డుకట్టగా మారిన హర్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. ప్రారంభంలో 60 రోజుల పాటు ఎలాంటి అదనపు రుసుము లేకుండా అంతర్జాతీయ నౌకల సురక్షి త ప్రయాణాన్ని ఇరాన్ కల్పించనుంది. ఇరాన్ ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి ఆ దేశసరిహద్దుల వద్ద అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఉపసంహరించకోనుంది.

**నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు:** అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా, ఇప్పుడు దాన్ని అమలు చేసేందుకు ఇరు దేశాలు సిద్ధ మవుతున్నాయి. ఈమేరకు తొలి దశ చర్చలు స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు సమావేశం కానున్నట్లు స్విస్ ప్రభుత్వం వెల్లడించింది. అందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. స్విస్ విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికా, ఇరాన్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులుకూడా ఆ సమావేశంలో పాల్గొననున్నారు.

**60 రోజుల్లో తుది ఒప్పందం:** ఈ తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని పూర్తి స్థాయి శాశ్వత ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలకు 60 రోజుల గడువును విధించారు. అవసరమైతే ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో ఈ గడువును మరింత పొడిగించుకునే అవకాశం ఉంది. రాబోయే 60 రోజుల్లో సమగ్ర, శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం ఇరు దేశాలు వరుస చర్చలు జరపనున్నాయి. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి కూడా ఈ ఒప్పందం ఖరారైనట్లు ధ్రువీకరించారు. ఒమన్‌తో పాటు ఇతర దేశాల సహకారంతో సంప్రదింపులు జరిపి ఈఅవగాహన ఒప్పందాన్ని తుది రూపం ఇచ్చినట్లు వెల్లడించారు.

**చమురు ధరలపై ప్రభావం:** అమెరికా- ఇరాన్ మధ్య ఒప్పందం అమల్లోకి రాగానే ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు స్థిరపడటం ప్రారంభమైంది. ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడంతో ఇంధన మార్కెట్లలో స్థిరత్వం ఏర్పడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం పశ్చిమాసియా రాజకీయాల్లోనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయ ప్రభావం చూపే

# మద్యం స్కాం కేసు.. సునీల్ అరెస్ట్

>> ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎమ్ఎల్ఎ) కింద ఈ అరెస్ట్ జరిగింది. తాజా పరిణామాలతో ఈ స్కామ్‌లో ఇడి అధికారికంగా అరెస్ట్ చేసిన వారి సంఖ్య మూడుకు చేరింది. వైద్యపరీక్షల అనంతరం సునీల్‌ను నాంపల్లి కోర్టులో ఇడి అధికారులు హాజరుపరిచారు. సునీల్ తరఫున సీనియర్ న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. సిగ్మా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయని ఇడి కోర్టుకు తెలిపింది. కారుమూరి నాగేశ్వరరావు పలుకుబడితో కాంట్రాక్టులు దక్కించుకున్నారని పేర్కొంది. ఈ కేసులో కారుమూరి కుమారుడు సునీల్ భారీగా లబ్ధి పొందినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పింది. కారుమూరి కుటుంబసభ్యుల మధ్య రూ.7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఆధారాలున్నాయని ఇడి కోర్టుకు వివరించింది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సందీప్, ప్రతాప్‌రెడ్డికి కాంట్రాక్టులు వచ్చాయని తెలిపింది. కాంట్రాక్టులు ఇప్పించిందుకు సునీల్‌కు సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ నుంచి రూ.28 కోట్లు ముడుపులు వచ్చాయని పేర్కొంది. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. అన్ని ఆధారాలను సరైన సమయంలో కోర్టుకు సమర్పిస్తామని చెప్పింది. మద్యం రవాణా స్కామ్‌లో ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపింది. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు కారుమూరి సునీల్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు ఈడీ అధికారులు తరలించారు.

**కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు**

మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు జారీ చేసింది. ఈనెల 23న హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని తెలిపింది. సిగ్మా సంస్థ నుంచి సునీల్‌కు చెందిన సుదర్శన కన్‌స్ట్రక్షన్ సంస్థ సబ్ కాంట్రాక్ట్ పొందింది. కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మద్యం రవాణా బాధ్యతలను సునీల్ హైదరాబాద్ కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ఈ రవాణా సబ్ కాంట్రాక్ట్ ద్వారా వచ్చిన లాభాల్లో ఏకంగా 85 శాతం సొమ్ము సునీల్, ఆయన సతీమణి కీర్తి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి మళ్లినట్లు న్యాయస్థానానికి తెలిపింది. ముఖ్యంగా సునీల్ భార్య కీర్తి బ్యాంక్ ఖాతాలోకి రూ.9.4 కోట్లు వచ్చి చేరినట్లు దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా గుర్తించాయి.మద్యం సిండికేట్ సభ్యుల నుంచి సునీల్, ఆయన తండ్రి నాగేశ్వరరావుకు నగదు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా సుమారు రూ.15 కోట్లు చేరినట్లు ఇడి సోదాల్లో ఆధారాలు లభించాయి.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

fb.com/vaartha Digital


బెంగాల్ సిఎం సువేందుతో మంత్రి లోకేష్ భేటీ

జగన్ మాతో వస్తే అభివృద్ధి చూపిస్తాం: మాధవ్

2లో


Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50


## పొగాకు రైతులను ఆదుకుంటాం

ఏదైనా కెజి రూ.200 తగ్గకూడదు

నో బిడ్... లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల భేటీలో సిఎం

6లో

## ఆక్వా ఫీడ్ ధర కెజికి రూ.4 తగ్గింపు

కంపెనీల అంగీకారం...

ధరల స్థిరీకరణపై కమిటీ

రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం

# పేదలకూ పారిశ్రామికాభివృద్ధి ఫలాలు



గురువారం సచివాలయంలో ఎస్ఐపిబి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ప్రోత్సాహం

మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు

పారిశ్రామిక ప్రాంతాల వద్ద తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం

ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు: సిఎం చంద్రబాబు

ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్

ఎస్ఐపిబి సమావేశంలో రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఎపిలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ఎకో సిస్టంను రూపొందించాలని సిఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులే స్థాపించగలరనే భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో 18వ ఎస్ఐపిబి సమావేశం జరిగింది. ఈసమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29,677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పేద, మధ్య తరగతి వారికి ఉద్యోగాలు కల్పించడమే కాదు... సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలి. ఆర్‌టిఐహెచ్ పరిధిలోని స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టాలి. ఇక వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా కరిక్యులమ్ తయారు చేసే దిశగా విద్యా శాఖ ఆలోచన చేయాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో ఎలాంటి ట్రెండ్స్ వస్తున్నాయో గమనించి దానికి అనుగుణంగా కరిక్యులమ్ రూపొందించాలి. రోబోటిక్స్ లాంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు కూడా మన విద్యా సంస్థల్లో ఉండాలి. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నాన్ సీరియస్ ప్లేయర్స్‌కు ఎపిలో చోటు లేదు. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక... వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలి. పనులు ప్రారంభించని సంస్థలతో టచ్‌లో ఉంటూ ఫాలో అప్ చేయాలి" అని సూచించారు.

**ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు:** "ఇథనాల్ తయారీ విషయంలో ముందడుగు వేయాలి. 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయోగిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గుతుంది. బయో ఫ్యుయల్స్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఈ విష >>2

## అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

చారిత్రక డీల్‌పై వర్చువల్‌గా ట్రంప్, పెజెష్కియాన్ సంతకాలు

తక్షణమే అమల్లోకి... పశ్చిమాసియాలో సైనిక చర్య ముగింపు

నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు... 60 రోజుల్లో తుది ఒప్పందం

తెరుచుకున్న హార్ముజ్ జలసంధి... తగ్గిన ముడిచమురు ధరలు





**పారిస్, జూన్ 18:** అమెరికా- ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరు దేశాల అధ్యక్షులు చారిత్రాత్మక మైత్రి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు చేశారు. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు 19వ తేదీన ఇరు దేశాలు అధికారికంగా శాంతి ఒప్పందం చేసుకోను న్నాయి. 14అంశాల ఆధారంగా ఇరు దేశాలు ఒప్పందం చేసుకు న్నాయి. గురువారం ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వర్చువల్ పద్ధతిలో 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న శత్రుత్వానికి బ్రేక్ వేస్తూ జరిగిన ఈ ఒప్పందం అంతర్జాతీయ దౌత్య రంగంలో ఒక ముందడుగుగా నిలిచింది. ఫ్రాన్స్‌లోని వర్సాలీస్ ప్యాలీలో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సమక్షంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేయగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కి యాన్ కూడా టెహ్రాన్ నుంచి దీనికి >>2



కారుమూరి నాగేశ్వరరావు ఆయన కుమారుడు సునీల్

## మద్యం స్కాం కేసు సునీల్ అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఇడి

కోర్టుకు తరలింపు... 14 రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు మాజీ మంత్రి తనయుడు

కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం రవాణా కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌ను ఈరోజు హైదరాబాద్‌లో ఇడిఅధికారులు అరెస్ట్‌చేశారు. >>2

## అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

పిఎంశ్రీ నిధుల వినియోగంలో ఎపి నం.1

జూనియర్ కాలేజీ విద్యార్థులకు కిట్స్ పంపిణీ

మాతృభాషను విస్మరించొద్దు

కస్తూరిబా హాస్టళ్లలో బెడ్స్ ఏర్పాటు చేయండి

విద్యాశాఖ అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం



గురువారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా, అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి >>2



గురువారం సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

## గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామంలో నర్సరీ ఉండాల్సిందే
- విబి జి రామ్‌జి కింద నర్సరీల పెంపకం అనుసంధానం
- ప్రజా ఉద్యమంలా సీడ్ బాల్స్ ప్రోగ్రాం
- అటవీ శాఖ అధికారులకు డి.సిఎం పవన్ ఆదేశం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. జులై 3వతేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పా టుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని >>2

## ఐపిఎస్ అధికారి సునీల్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?

ఎంపి రఘురావ కస్టోడియల్ టార్చర్ కేసులో ధర్మాసనం ప్రశ్నలు

సమయమివ్వాలన్న సునీల్ నాయక్ తరపు న్యాయవాది

విచారణ నేటికి వాయిదా

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపిఎస్ అధికారికి ముందస్తు >>2

## ఇసుక లూటీపై ఇడి విచారణ

త్వరలోనే సిఎం చేతుల మీదుగా 'జొన్నగిరి గోల్డ్‌మైన్' ప్రారంభం

రూ.50వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా నూతన 'బీచ్ సాండ్ పాలసీ'

రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**సచివాలయం, జూన్ 18 ప్రభాతవార్త:** గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత, అడ్డగోలు నిర్ణయాల వల్ల సర్వనాశనమైన రాష్ట్ర మైనింగ్ రంగాన్ని కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా తిరిగి పట్టాలెక్కించిందని రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనా లోపాల వల్ల మైనింగ్ వృద్ధి రేటు 24నుంచి 7శాతానికి పడిపోయి, రాష్ట్ర ఖజానాకు ఏకంగా రూ.19,137 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలతో సహా శ్వేతపత్రం విడుదల చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హాయాంలో జరిగిన భారీ ఇసుక దోపిడిని తాము శాటిలైట్ డేటా ఆధారంగా సాంకేతికంగా నిరూపించామని, 5.08కోట్ల మేజర్ మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా తరలించినందుకు గాను రూ.3,891 కోట్ల రికవరీ డిమాండ్ నోటీసులు జారీ చేశామని ప్రకటించారు. ఈ కుంభకోణంపై ఇప్పటికే రాష్ట్రంలో ఎసిబి కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలో దిగి లోతైన దర్యాప్తు జరుపుతోందని మంత్రి స్పష్టంచేశారు. 2023లో విపరీతమైన డిమాండ్ ఉన్న "సిలికా సాండ్" రంగాన్ని దౌర్జన్యంగా లాక్కొని పారదర్శక ఆన్‌లైన్ ఐడీలను బ్లాక్ చేసి కేవలం 20లీజులను "వామనా ఎంటర్‌ప్రైజెస్" అనే సిండికేట్‌కు కట్టబెట్టడం వల్లే రాష్ట్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలకు పూర్తి చెక్ పెడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రజలపై భారం మోపే సేల్స్ రేట్, డిఎంఎఫ్, మెరిట్ ఫీజులను పూర్తిగా రద్దుచేసి విప్లవాత్మక "ఫ్రీ సాండ్ పాలసీ"ని విజయవంతంగా అమలు చేస్తుందని కొల్లు రవీంద్ర వివరించారు. 5 ప్రభుత్వ శాఖలతో కూడిన "కలెక్టర్ టాస్క్ ఫోర్స్" నిరంతర పర్యవేక్షణ వల్ల మార్కెట్లో ఇసుక ధర 25నుంచి 30శాతం వరకు తగ్గిందని ప్రజలు కేవలం తవ్వకం,రవాణా ఖర్చులు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. జులై 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,91,85,793 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేశామని, ప్రస్తుత వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా ముందస్తుగా 238 స్టార్ >>2

## భారత్-ఇయు మధ్య చారిత్రాత్మక ఎఫ్‌టిఎ

వివాటెక్ సదస్సులో ప్రధానిమోడీ




**ప్యారిస్,జూన్ 18:** ఫ్రాన్స్‌లో నిర్వహించిన వివాటెక్ 10వ ఎడిషన్ కార్యక్ర మంలో పాల్గొని ప్రసంగించిన ప్రధానిమోడీ యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో అధ్యక్షుడు మెక్రాన్, నిర్వాహకుల కృషి అభినందనీయమని అన్నారు. అలాగే 2026 సంవత్సరం భారత్ యూరప్ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన యేడాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ యేడాది ప్రారంభంలో భారత్ యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించడమేకాకుండా ప్రతిభ, సాంకేతికత, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను తెరుస్తుందని మోడీ వెల్లడించారు. ఇదేవిధంగా, ఇండియా ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ ప్రారంభంతో భారత్, యూరప్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని >>2


వార్త

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.

**న-ఆస్కార్ వైల్డ్**


# అప్రమత్తతే అసలైన మందు!

దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు, అటు కేంద్ర ప్రభుత్వం కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగనిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగాపొందుపరిచారు. ఇన్ని దశాబ్దాలు గడిచిపోయినా అందరికీ సంపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని వ్యాధులను నియంత్రించడం వైద్యులకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, కొత్త చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్తకొత్త వ్యాధులు విస్తరిస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే చిగురుటాకులా వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది కోలుకోలేకపోతున్నారు. గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయసుతో తేడాలేకుండా చిన్నాపెద్ద అందరూగుండెజబ్బులకు బలైపోతున్నారు. ఇక కిడ్నీవ్యాధుల గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్రం కిడ్నీవ్యాధుల్లో అగ్రస్థానంలో ఉన్నట్లు ఇటీవల వెల్లడించిన సర్వేలు స్పష్టం చేశాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్ని పెట్టినా సరిపోవడం లేదు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. వర్షాకాలం సీజన్ ఆరంభం కావడంతో కొత్త నీరు రాక, పాత నీరు కలయికతో వ్యాధులు విస్తరిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరించే ప్రమాదం ఉన్నట్లు వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎబోలా వ్యాధి దేశంలో అంతగా విస్తరించకపోయినా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా దేశంలో కొన్ని ప్రాంతాల్లో సోకుతున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎబోలా వ్యాధి సోకిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. ఒక్కఅల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు, వైద్యరంగ నిపుణులు, శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. దశాబ్దాల తరబడి చెప్తూనేఉన్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలియనవి కావు. అయినా రోగ నిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన సమయం ఇది. శరీరంలో రోగనిరోధక శక్తినిఒక్క రోజుల్లోనో, ఒక్క వారంలోనో, ఒక్క నెలలో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమ టించేవారు కోట్లసంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? మరోపక్క కాలుష్యం ప్రజా రోగ్యాన్ని కాటువేస్తున్నది. ఢిల్లీలో చల్లికాలం వాయు కాలుష్యం చుట్టుముట్టడం ఆ పౌరులను ఉక్కిరిబిక్కిరి చేయడం ప్రతి యేడాది జరుగుతూనే ఉన్నది. ఢిల్లీలోనే కాదు భారతదేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, వాయు, నీటికాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క వాహన కాలుష్యం దీనికితోడవుతున్నది. వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడంలేదు. అన్నిటికంటే మించి కేన్సర్ వ్యాధి మానవాళిపై పంజా విసరడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల కేన్సర్‌కు సంబంధించి మందుల ధరలు ఒక్కసారిగా పెంచారు. ఇది మరింత ఆర్థిక భారం పడిందనే చెప్పొచ్చు. దేశంలో నాలుగేళ్ల క్రితం పధ్నాలుగు లక్షల అరవైవేలకుపైగా కేన్సర్‌కేసులు నమోదు కాగా ఇప్పుడది మరో నాలుగులక్షలకు అదనంగా నమోదవుతున్నట్లు వైద్య పరిశోధన మండలి, జాతీయ కేన్సర్ నమోదు కార్యక్రమం లెక్కలు చెబుతున్నాయి. ఈ కేన్సర్‌ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు జాతీయ ఆరోగ్య కమిషన్ పలుచర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం చెబుతున్నది. ధూమపానం ఈ కేన్సర్‌ను పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం వల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక కేన్సర్‌ల నుండి తప్పించుకోవచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియంది కాదు. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని చెప్పుకునే పాలక పెద్దలు ఈ ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. ఇవేకాదు కల్తీ కూడా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. ప్రజారోగ్యానికి చేటు తెస్తున్న విధానాలకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది.



అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.

**వార్విక్**



ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.

**ఎల్లెన్ గ్లాస్గో**

# ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారం

**ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాలంలో సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పనతోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచ గలదనడంలో ఎటువంటి సందేహం లేదు.**



**రామ కిష్టయ్య సంగన భట్ల**

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహ భాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయా పజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్)ప్రభావాలు, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీనిఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగువిధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకురావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది. శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002లో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015, ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్రసంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభంకావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులుతొందరపాటు



పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75నుండి 100 మిల్లీ మీటర్ల వరకు స్థిరమైనతగినంత వర్షపాతంనమోదై, భూమి లోపలి పొరల వరకు తేమచేరినట్లు నిర్ధారించుకున్నతర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలంగడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘకాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడ మంచిది. ఇందు కోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటివారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్‌లో ఈచిరుధాన్యాలకు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. తెలుగురాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగుచేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభదశలోనూ, పూత, కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తిసాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతి లో కంది, పెసర, మినుము వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది. ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తిచెప్పకతప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరిరకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక, నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాం

# పరిమితులతో డిజిటల్ అడిక్షన్‌కు చెక్!

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

భారతదేశ వ్యాప్తంగా బాలలు, కౌమార దశ యువతలో క్రమంగా స్క్రీన్ టైమ్ పెరుగుతూ, డిజిటల్ వ్యసనం బారినపడుతూ, తమ ఆరోగ్యాలను మొగ్గ స్థాయిలోనే కోల్పోతున్నారని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన 2025-26 ఆర్థిక సర్వే హెచ్చరికలు చేయడం గమనార్హం. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, గేమింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో మితిమీరిన వాడకంతో వారి చదువులపైననే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై కూడా తీవ్రమైన దుష్ప్రభావాలను చూపుతున్నట్లు సర్వే పేర్కొంటున్నది. వయస్సు ఆధారిత డిజిటల్ పరిమితులను విధించవలసిన సమయం ఆసన్నమైనదని హెచ్చరికలు చేసింది. అపరిమిత డిజిటల్ వినియోగదారుల్లో అధికంగా బాలలు, కౌమార దశ పిల్లలు ఉండడంతో రేపటి భారత భవిష్యత్తు సంక్షోభంలో పడవచ్చని, హానికరమైన కంటెంట్ ఉన్న యాప్‌ల్లో మునిగి తమ చిరు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. డిజిటల్ వ్యసనం మితిమీరితే పిల్లలు మానసిక క్షోభ, క్రియాత్మక బలహీనతలకు దారి తీస్తుందని సర్వే నిర్వచిస్తున్నది. డిజిటల్ అడిక్షన్ హద్దులు దాటితే ఏకాగ్రత క్షీణించడం, నిద్రలేమీ సమస్యలు ఉత్పన్నం కావడం, ఆందోళన, నిరాశ, ఒత్తిడి ప్రమాదకర స్థాయికి పెరగడం, విద్యార్జన కోరిక తగ్గడం, సామాజిక సంబంధాలు తగ్గడం, ఒంటరితనం వేధించడం, చురుకుదనం మాయంకావడం, నైపుణ్యాలు తగ్గడం, పనితీరు క్షీణించడం, ఉత్పాదకత తగ్గడం లాంటి పలు అనర్థాలు జరుగుతున్నట్లు గమనించారు. పెద్దల్లో సైతం డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరగడంతో సైబర్ మోసాలు, బెదిరింపులు పెరగడం, ఆన్‌లైన్ ఖర్చులు పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఉత్పాదకత పడిపోవడం గమనిస్తున్నాం. డిజిటల్ అడిక్షన్ వలలో చిక్కి3నుంచి5 గంటలకు పైగా నీలి తెరల ముందు కూర్చున్న పిల్లల్లో శారీరక శ్రమతగ్గడం వల్లప్రమా దకర జీవనశైలి వ్యాధులు పెరగడం గమనిస్తున్నామని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డిజిటల్ అడిక్షన్ దుష్ప్రభావాల ను తగ్గించేందుకు 'డిజిటల్ ఫాస్టింగ్' వ్రతం చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ప్రతి రోజు కొన్ని గంటల పాటు లేదా వారానికి 1లేదా 2రోజుల పాటుస్మార్ట్ తెరలకు దూరంగా ఉండడాన్ని డిజిటల్ ఫాస్టింగ్ (ఉపవాసం) అని పిలుస్తున్నాం. 2024లో భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 43శాతం సామాజిక మాధ్యమాలను వాడినట్లు సర్వేలు నిర్ధారిస్తున్నాయి. పాఠశాలల్లో శారీరక వ్యాయామం తప్పనిసరి చేయడంతో పాటు స్క్రీన్‌టైమ్ నిర్వహణపై తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని సూచిస్తున్నారు. దీనితోపాటుగా వయస్సును బట్టి డిజిటల్ యాక్సస్ విధానాలు, హానికర కంటెంట్ విపరీతాలను అదుపుచేయడం, స్క్రీన్ టైమ్‌ను విధిగాతగ్గించడం జరగాలి. ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్దిష్టవయస్సుకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలపై నిషేధంవిధించడం ఇతర దేశాలను మార్గదర్శకం చేయాలి. దక్షిణకొరియా సైతం షట్‌డౌన్ చట్టంద్వారామైనర్లుగేమింగ్ వెబ్‌సైట్లను వాడ కుండా పరిమితులు విధించడం హర్షదా యకం. ఇదేక్రమంలో

# అప్పుల పునాదులపై ఆశల సౌధం

**నిలేష్**

సొంతిల్లు.. ప్రతి సామాన్యుడి జీవితంలో అతిపెద్ద కల. కానీ ఆ గూడు కట్టుకునే క్రమంలో మధ్యతరగతి ప్రజలు తమ బతుకుల్ని, పిల్లల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారన్నది ఇప్పుడు తీవ్రఆందోళన కలిగిస్తున్న అంశం. 'అందరికీ సొంతిల్లు', 'సులభమైన వాయిదాలు' అంటూ ఊరిస్తున్న ప్రకటనల వెనుక.. రక్తం పీల్చుతున్న ఈఎంఐల వాస్తవ పరిస్థితులు మన కళ్లముందే కదలాడుతున్నాయి. ఒకప్పుడు రిటైర్మెంట్ వయసుకు దగ్గర పడుతున్నప్పుడు మాత్రమే సొంతింటి గురించి ఆలోచించేవారు. నేటి కార్పొరేట్ కల్చర్, బ్యాంకులు ఇస్తున్న భారీ రుణాలు, సమాజంలో పెరుగుతున్న పోటీతత్వం యువతనుపాతికేళ్లకే ఇంటి రుణాలవైపు నెడుతున్నాయి. స్తోమతకు మించి భవిష్యత్తులో రాబోయే జీతాన్ని ముందే లెక్కలేసుకుని లక్షలకు లక్షలు అప్పులు చేస్తున్నారు. కానీ ఊహించని ఆర్థిక మాంద్యాలు, ఉద్యోగాల్లో కోతలు వారి లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. నెల ఒకటో తేదీ రాగానే భయం వేస్తోంది. నా జీతం 60వేలు, అందులో 40వేలు ఈఎంఐకేపోతోంది. మిగిలిన 20వేలతో ఇంటి అద్దె, రేషన్, పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు' అంటూ సగటు ఓ ప్రైవేట్ ఉద్యోగి కన్నీటి పర్యంతమవడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఇది ఒక్కరి పరిస్థితే కాదు. చాలామంది జీవితాలు ఈఎంఐల కొరల్లో నలిగిపోతున్నాయి. నెలసరి వాయిదాలు చెల్లింపుల కోసం మధ్యతరగతి కుటుంబాలు తమ ప్రాథమిక అవసరాలను సైతం త్యాగం చేస్తున్నాయి. చిన్నచిన్న కోరికలను చంపుకుంటున్నాయి. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించే క్రమంలో పిల్లలను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయి. నెలవారీ వాయిదాల భయంతో పిల్లలను మంచి స్కూళ్లలో చదివించలేక సాధారణ పాఠశాలలకు మారుస్తున్న తల్లిదండ్రులు ఎందరో. అటు అప్పులు తీర్చలేని క్రమంలోఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించాల్సిన దుస్థితి బడుగు జీవులది. చిన్నపాటి జబ్బులొస్తే ఆసుపత్రికి వెళ్లకుండా మెడికల్ షాపుల్లో మందులు, మాత్రలు తెచ్చుకుని సర్దుకుపోవాల్సిన సందర్భాలు అనేకం. ఇక పెద్ద వైద్యంఖర్చు వస్తే అప్పుల పాలే గతి. సాధారణంగా మధ్యతరగతి వారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. బ్యాంకులోను తీసుకుని ఇల్లు కొన్నప్పుడు, ఆ ఆదాయంలో సగానికి పైగా నెలసరి వాయిదాలకే సరిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా జీతాలు పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల నెలాఖరు వచ్చేసరికి జేబులు ఖాళీ అవుతు న్నాయి. అనుకోని వైద్య ఖర్చులు రావడం, ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురవడం, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థి తులు సగటు పేద, మధ్యతరగతి జీవిని మరింత కృంగదీ స్తున్నాయి. ఇలాంటి చిన్నకుదుపు వచ్చినా సరే వారి ఆర్థిక ప్రణాళిక పేకమేడలా కూలిపోతోంది. నెలసరి వాయిదాలు సమయానికి చెల్లించలేక బ్యాంకుల నుంచి వచ్చే ఒత్తిళ్లు వారి



ప్రశాంతతను పూర్తిగా దూరం చేస్తున్నాయి. వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్న అప్పులు ఒకపక్క ఇంటి ఈఎంఐ కట్టడానికి, మరోపక్క ఆ నెల గడవడానికి మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, అధిక వడ్డీలకు బయట అప్పులు చేయడం ప్రారంభిస్తారు. ఇది ఒక ప్రమాదకరమైన విషవలయం లాంటిది. ఒకఅప్పు తీర్చడానికి మరోఅప్పు చేయడం. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి అసలు కంటే వడ్డీలే భారంకావడం వంటి పరిణామాలు బలవన్మరణాలకు ఉసిగొలుపుతున్నాయి. మరో మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యం అనుకునే పరిస్థితికి దారితీస్తున్నాయి. ఈ చక్రంలో చిక్కుకుని నిత్యం అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువుపోతుందన్న భయంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కరోనా తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు, వ్యాపారాల్లో నష్టపోయిన వారు ఈఎంఐలు కట్టలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేకపోతున్నారు. ఒక్క నెల వాయిదా దాటితే చాలు.. బ్యాంకుల నుంచి వరుస ఫోన్ కాల్స్. రెండు నెలలు దాటితే ఇంటి ముందుకు రికవరీ ఏజెంట్లు. పరువుపోతుందనే భయంతో, ఆ క్షణానికి గట్టెక్కడానికి అప్పుల మీద అప్పులు, క్రెడిట్ కార్డుల మీద నగదు విత్‌డ్రాలు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు. 'సొంతిల్లు' అనే సామాజిక హోదా కోసం, ఏమాత్రం ఆర్థిక ప్రణాళిక లేకుండా వేసే అడుగులు జీవితాన్ని అంధకారంలోకి నెట్టే స్థాయని చెప్పడానికి అనేకమంది పేద మధ్యతరగతి జీవుల గాథలే సజీవ సాక్ష్యం. ఇల్లు కొనాలనుకునే ముందు మన స్తోమత ఏంటి? అత్యవసర పరిస్థితులు వస్తే తట్టుకునే ప్రత్యామ్నాయం ఉందా? అని ప్రతి ఒక్కరూ తమనుతాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. గృహ రుణం తీసుకునే సమయంలో నెలవారీ ఈఎంఐలు చెల్లించగలమనే నమ్మకం ఉన్నప్పటికీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోతుంటాయి. చాలా కుటుంబాలు ఇతర అవసరాలను వాయిదా వేసుకుంటూ, తమ కోరికలను త్యాగంచేస్తూ ఈఎంఐలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు అదనపు ఉద్యోగాలు చేయడం, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినప్పుడు ఈఎంఐలు చెల్లించడం కష్టసాధ్యమవుతోంది. నెలవారీ వాయి దాలు చెల్లించలేక బ్యాంకుల నుంచి నోటీసులు అందుకో వడం, జరిమానాలు పడటం, క్రెడిట్ స్కోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇళ్లను వేలం వేసే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. దీంతో సొంతింటి కల ఆనందాన్ని ఇవ్వాల్సిన చోట ఆందోళనలకు కారణమవుతోంది. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం, కానీ అది మన రోజువారీ ప్రశాంతతను హరించేదిగా మారకూడదు. తమ ఆదాయం, భవిష్యత్ అవసరాలను కచ్చితంగాఅంచనా వేసుకుని మాత్రమే ఇంటి బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. కనీసం ఆరు నెలల ఈఎంఐలు, ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును అత్యవసర నిధిగా పక్కన పెట్టిన తర్వాతే ఇంటి లోన్‌కు వెళ్లడం సురక్షితం. అదే సందర్భంలో కలలు కనడం తప్పు కాదు, కానీ ఆ కలల సాకారం మన వర్తమానాన్ని,

# ప్రజావాక్కు



## సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధిపథంలో స్థిరంగా ముందుకు సాగుతోందనినీతిఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం. వికసిత భారత్‌లక్ష్యసాధనలో ఆర్థికసంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, యువతసాధికారత, మహిళల భాగస్వామ్యం, సహకార సమాఖ్యవ్యవస్థ కీలకపాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభి వృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం, వ్యాపారం, శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. అదే సమయంలో మహిళల అభివృద్ధికోసం నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధిశిక్షణ, భద్రతా చర్యలు, ఉద్యోగినుల వసతి గృహాలు, డిజిటల్‌అక్షరాస్యతకార్యక్రమాలను విస్తరించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. విద్య మన సమాజ అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికిమించి ఖర్చుచేయాల్సి వస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యతఅవసరం. విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకుసాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## అభివృద్ధికి నోచుకోని గ్రామాలు..

దేశంలో ఇంకా చాలా గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోఉన్నాయి. గ్రామాలకు నిధులు కేటాయించిన ఇంకా అభివృద్ధి చెందకుండా తగిన మంచినీరు మిగతా సౌకర్యాలకు నోచుకోలేని ప్రజలు ఎంతోమంది ఉన్నారు. సమస్యలను పరిష్కరించకుండా అలాగే వదిలేస్తే అభివృద్ధి కావడం అసంభవం.

## ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మోత మోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారు అయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారు అనుసరిస్తున్న కొన్ని అర్థం, పర్థంలేనిఅస్థవ్యస్థమైనవిధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది. దీంతోప్రజల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది. అంటే మనం కష్టపడి సంపాదించుకొన్న సొమ్ము దొంగల పాలు అయినట్లు ఇలా ఎస్.ఎం.ఎస్‌ల రూపంలో బ్యాంకు వారికి మన సొమ్ము స్వాహా అయిపోతుండటం మరీ విడ్డురమైన విషయం. ఏదిఏమైనా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాల మూలాన బ్యాంకులలో డబ్బులు డిపాజిట్ చేయాలంటేనేప్రజలుఒకవిధమైనఅభద్రతాభావానికిగురవుతున్నారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

## గురుకుల కాలేజీ తరలించొద్దు

2026-27 విద్య సంవత్సరం నుండి జిల్లా కేంద్రంలో ఉన్న గురుకుల కాలేజీని మారుమూల గ్రామాలకు తరలించడం సరికాదు. విద్యార్థులకువసతి, రవాణా సౌకర్యం లేదు. తగిన సిబ్బంది అవసరం ఉంటుంది. నీటి వసతి, బిల్డింగ్, టీచింగ్ స్టాఫ్‌కు నివాస యోగ్యమైన వసతిఉండాలి. కనుక ప్రభుత్వం జిల్లా కేంద్రం లో ఉన్న గురుకుల కాలేజీలను మారుమూల చిన్న గ్రామాలకు తరలింపు అనే ఆలోచన సరికాదు. ఈ విషయం ప్రభుత్వం విరామించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటినుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు, కానీదాని ప్రభావం సమాజంపై తీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తివల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తున్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాదిమంది మరణిస్తున్నారు. అయినా మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం కారణంగా ప్రభుత్వాలు పూర్తిగా నిషేధం చడంలో వెనుకడుగు వేస్తుంటాయి.

-కె. రామారావు, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## కోల్‌కత్తాలో మంత్రి లోకేష్ నేడు ఐసిసి సదస్సుకు హాజరు

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులే లక్ష్యంగా ప్రతి అవకాశాన్ని ఏపీ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వినియోగించుకుంటున్నారు.ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం కోల్ కతా నగరానికి వెళ్ళారు. అక్కడ పశ్చిమ బంగా ప్రభుత్వ అధికారులు. స్థానిక తెలుగు సంఘం సభ్యులు, టీడీపీ శ్రేణులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.ఇక ఈ నెల 19న శుక్రవారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసిసి) ఆధ్వర్యంలో ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు అనే అంశంపై ఐటీసీ సోనార్ హోటల్ లో జరిగే ప్లీనరీలో పాల్గొంటారు.

## ఎక్సైజ్ శాఖలో ఇద్దరికి పదోన్నతి

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో ఇద్దరు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ శాఖలో అదనపు కమిషనర్‌గా వి.అనసూయదేవికి, ఎక్సైజ్‌శాఖలో జాయింట్ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డికి పదోన్నతి ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని వాటిలో స్పష్టం చేసారు.

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రవేశాలు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి పలు కోర్సులలో ప్రవేశాల కోసం అర్హత గల అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి సర్టిఫికేట్ కోర్స్ ఇన్ పల్లియేటివ్ కేర్ పిజిడిప్లొమా ఇన్ డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిప్లొమా ఇన్ యోగా,పిజి డిప్లొమా ఇన్ యోగా ఆసక్తిగల అభ్యర్థినులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎస్‌పిఎంవివి. ఎసి. ఇన్"నుండి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తును జులై 15వతేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి. సువర్ణలతా దేవి తెలిపారు.కోర్సుల అర్హతలు, ఫీజులు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం"డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. ఎస్‌పిఎం వివి. ఎసి.ఇన్" వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని ఆమె పేర్కొన్నారు.

## మనస్థాపంతో మహిళ మృతి

**సంతకవిటి (విజయనగరం జిల్లా), జూన్ 18 (ప్రభాతవార్త):** సంతకవిటి మండలంలో రామరాయపురం గ్రామానికి చెందిన కళావతి పొందూరు మండలంలో పెనుబర్తి సమీపాన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. అయితే దొంగతనం కేసులు కళావతిని, కుమారుడు చిరంజీవిని పోలీసులు పదేపదే విచారణ చేయడంతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని కుమారుడు చిరంజీవి చెప్పాడు. అయితే రామారాయంపురం గ్రామంలో గత నెల 25వ తేదీన ఒక వ్యక్తి ఇంట్లో నాలుగు తులాల బంగారం, పదివేల నగదు దొంగతనం జరిగింది. అయితే ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక ఎస్సై అనుమానితులుగా కళావతిని మరియు కుమారుడు చిరంజీవిని విచారణ పేరిట పోలీస్‌స్టేషన్‌కు పదేపదే పిలవడంతో వారిద్దరూ మనస్థాపానికి గురైనట్టు తెలుస్తోంది. అయితే మంగళవారం కూడా మరోసారి స్టేషన్‌కు రావాలని సమాచారం



అందించడంతో ఇద్దరు వెళ్లారు. అక్కడ ఎస్సై గోపాలరావు అందుబాటులో లేకపోవడంతో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు తీవ్ర మనస్థాపానికి గురై వారు పదేపదే స్టేషన్‌కి రమ్మని పిలవడం ఊర్లో ఉండేవారు వారిపై దొంగలుగా ముద్రలు వేయదంతో వీరు ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వీరిద్దరూ పెనుబర్తి సమీపంలో రైల్వే పట్టాల వద్ద రైలు దగ్గరకి సమీపిస్తుండగా చివరి క్షణంలో తల్లి, కుమారుడు చిరంజీవిని బలవంతంగా పక్కకు నెట్టి తాను రైలు కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయింది. తన కళ్ళముందే తల్లి చనిపోవడం చూసి కుమారుడు మానసిక వేదనతో క్రుంగిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల లింక్ ద్వారా లేదా వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని తెలిపారు. ఇంటర్మీడియట్ లో రెండో ఏడాది విద్యార్థులకూ ఇంప్రూవ్‌మెంట్ రాసుకునే అవకాశం కల్పించడంతో 1.83 లక్షల మందికి పైగా విద్యార్థులు తమ మార్కులను మెరుగు పరుచుకున్నారని మంత్రి వెల్లడించారు. ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసిన 91,303 మందిలో 48,149 మంది (53 శాతం) విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని లోకేశ్ వివరించారు. కొత్తగా పరీక్షరాసిన 1,02,018 మందిలో 57,327 మంది (56శాతం) విద్యార్థులు పాసై, తమ స్కోరును పెంచుకున్నారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులందరూ ఉన్నత చదువుల వైపు మరింత ఆత్మవిశ్వా సంతో అడుగులు వేయాలని, వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో ఫెయిల్ అయిన దాదాపు 1లక్ష మంది విద్యార్థులు ఈ పరీక్షల ద్వారా పాసై, తమ విద్యాసంవత్సరాన్ని కాపాడు కున్నారని లోకేశ్ పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమించి పరీక్షల్లో విజయం సాధించి మార్కులు మెరుగు పరుచుకున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ప్రథమసంవత్సరం పరీక్ష రాసిన 2,29,034 మందిలో 1,35,435 మంది (59 శాతం) విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకున్నారని వివరించారు. కొత్తగా పరీక్ష రాసిన 1,09,003 మందిలో 42,379 మంది (39 శాతం) విద్యార్థులు పాసై, మార్కులను పెంచుకున్నారని లోకేశ్ వెల్లడించారు. ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యార్థులకూ ఇంప్రూవ్‌మెంట్ సదుపాయం కల్పించారు.గతంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉండగా ఈసారి ద్వితీయ ఇంటర్ విద్యార్థులూ తమ మార్కుల్ని మెరుగు పరుచుకొనే అవకాశం కల్పించారు. విద్యార్థి రాసిన పరీక్షల్లో ఏ ప్రయత్నంలో ఎక్కువ మార్కులు వస్తే, వాటినే తుది ఫలితంగా పరిగణిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఇంప్రూవ్‌మెంట్ రాసే అవకాశంలేదు. ఇతర రాష్ట్రాల బోర్డుల్లో అమల్లో ఉన్న ఇంప్రూవ్ మెంట్ విధానాలను పరిశీలించిన అనంతరం చర్చించి ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

# మారుమూలలకు బిఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాలి

### చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు




గురువారం టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి దగుమళ్ళ ప్రసాదరావు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బిఎస్ఎన్ఎల్ సేవలను చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో మారుమూల గ్రామాలకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్లప్రసాదరావు, బిఎస్ఎన్ఎల్ పిజిఎం ఎవి కుమార్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని 57 కొత్త 4జి మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ చిత్తూరు ఎంపి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు సైతం చేరువ చేసేందుకు పటిష్ట చర్యలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ సహకారంతో బిఎస్ఎన్ఎల్ చేపట్టిన 4జి సాచురేషన్ టవర్ ప్రాజెక్టు పనులు, ఫైబర్ కనెక్టివిటీ సేవలకు సంబంధించిన పలు అంశాల పై సమీక్షించారు. బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలనీ, బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తృత పరచాలని టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. అలాగే వినియోగదారులు తమ సమస్యలను సలహా మండలి దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారం పొందాలని ఆయన కోరారు. బిఎస్ఎన్ఎల్ పిజిఎం కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 112 టెలికాం 4జిను నిర్మించినట్లు చెప్పారు. వీటి ఏర్పాటు వల్ల సిగ్నల్స్ అందని, మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో 57 కొత్త 4జి మొబైల్ టవర్స్ ను పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఇందులో ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు పరిధిలో 22, తిరుపతి పార్లమెంటు పరిధిలో 14, రాజంపేట పార్లమెంట్ పరిధిలో 14 టవర్లను ఏర్పాటు చేసి, త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు వలన గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరిస్తాయని, పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ, రోడ్లు భవనాలు, అటవీశాఖ విభాగాలకు సంబంధించి, ఏదైనా అవరోధాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యకు పరిష్కారాన్ని చూపు తానని ఎంపీ దగ్గుమళ్ళ అన్నారు. ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ డిజిఎంలు వెంకోబారావు, జయశంకర్, దామోదర్, శివరాం, సిబ్బంది, జిల్లాలోని ఎజిఎం,డిఇలు

# విలాసాల కోసం దొంగతనాలు: నలుగురు అరెస్ట్




గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు


**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో,పట్టణాల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠాను తిరుపతి క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి నగరంతోబాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల్లో సుమారు 8బంగారు గొలుసు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. సుమారు 17 లక్షల రూపాయలు విలువైన 128 గ్రాముల (16 సవర్లు) బంగారు ఆభరణాల స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు వారినుండి రాబట్టారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఈ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. గత కొంతకాలంగా ఓజిలి, నాయుడుపేట పరిసర మండలాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలలోని బంగారు గొలుసులను లాక్కెళ్లే చైన్ స్నాచింగ్ ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బా రాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసులు,నాయుడుపేట డిఎస్పీ జి. చెంచుబాబు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నాయుడుపేట రూరల్ సిఐ జి.సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ కె. శ్రీకాంత్ వారి సిబ్బంది నిఘాలో పిగిలాం నరేంద్ర అలియాస్ నవీన్, బల్లి లికిత్ కుమార్ అలియాస్ లిఖిత్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి బంగారుగొలుసులు-6, బంగారు చెవికమ్మ, 128 గ్రాములు (16 సవర్లు), బంగారు నగలుతోబాటు మోటార్ సైకిల్ ,స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఓజిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మహిళల వద్ద, నాయుడుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళల వద్ద, చిట్టమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, బాలాయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, కోట పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఒక మహిళ వద్ద చైన్ స్నాచింగ్ లకు పాల్పడినట్లు అంగీకరించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో నేరాల వైపు అడుగులు వేస్తున్న యువత తమ జీవితాలను తామే నాశనం చేసుకుంటున్నారు. నేరాలకు పాల్పడే వారిని అత్యాధునిక సాంకేతిక సహాయంతో కఠిన చర్యలు తీసుకొని వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు కనిపించిన వెంటనే అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఇంకా నిందితులు నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంకు చెందిన బల్లి వెంకటేశ్వర్లు (34),4. పిగిలాం గణేష్ (32)లను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీలు చెంచు బాబు (నాయుడుపేట), శ్యాంసుందర్ (క్రైమ్)), సిఐలు సంఘమేశ్వర రావు, శివకుమార్ రెడ్డి ,సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఆర్వీ రాజు ,కానిస్టేబుల్ ఎన్. గంగాధర్ ఈ.భాస్కర్ ,ఎస్. వినయ్ కుమార్ లను

# సర్కారు బడిలో కలెక్టర్ కొడుకు..

### ఆదర్శంగా నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

### ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని పెంచిన కలెక్టర్ నిర్ణయం



**వీరఘట్టం, జూన్ 18 ప్రభాతవార్త:** ఆయన జిల్లాకు కలెక్టర్, అంతే కాదు జిల్లా మేజిస్ట్రేట్ కూడా. అంత పెద్ద హోదాలో ఉన్న ఆయన అవన్నీ పక్కనపెట్టి తన కుమారుడిని సర్కార్ బడిలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు, ఉన్నతాధికారులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ముందుకు రావడం విశేషమే మరి. కలెక్టర్ కుమారుడైన ఎన్.క్రిష్ ధరణ్ రెడ్డిని పార్వతీపురంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఒక గొప్ప ఆదర్శంగా నిలిచి అందరికీ చెప్పడమే కాదు చేసి చూపించారు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి.

**మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం**

కలెక్టర్ కుమారుడు క్రిష్ ధరణ్ రెడ్డి గతంలో విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆయనను పార్వతీపురంలోని ప్రతిష్టాత్మక డాక్టర్ దిండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు. ఒక జిల్లా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి తన కుమారుడిని తమ పాఠశాలలో చేర్పించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, బాధ్యతాయుతంగా పని చేస్తామని వారు గర్వంగా చెబుతున్నారు. అయితే ఈ పాఠశాలకు ఇలాంటి ఘనత దక్కడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో ఇక్కడ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన కూర్మనాథ్ సైతం తన కుమారుడిని ఇదే మున్సిపల్ పాఠశాలలో చదివించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకున్న మక్కువను చాటుకున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ కూడా అదే బాటలో నడవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభిస్తోంది. మరి కలెక్టర్‌ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పిల్లలు కూడా సర్కార్ బడుల్లోనే చేర్పిస్తారా, లేదా కార్పొరేట్ పాఠశాలల్లోనే కొనసాగిస్తారా అనేది వేయికళ్లతో వేచి చూడాలి మరి.

## ఆర్‌డిఎస్‌ఎస్ పనులు వేగవంతం: ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 18 ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాల్లో పునర్వ్యవస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం (ఆర్ డి ఎస్ ఎస్) కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం ఆర్‌డిఎస్‌ఎస్ పనులపై సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లతో శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్లకు సమస్యలు ఎదురైన సంధర్భాల్లో వెంటనే సంస్థ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) జే.రమణాదేవి, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, శ్రీనివాసులు,సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాఘవేంద్రం, చంద్రశేఖర రావు, అమర్‌బాబు, ప్రదీప్‌కుమార్,సుధాకర్, శేషాద్రిశేఖర్, మోజెస్,పిఆర్‌ఒ తోటమధుసూదన,ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## 24న భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలోని శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో 24వ తేది ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. తిరుమల ఆలయంలో పల్లవరాణి సామవై కొన్ని వందల సంవత్సరాల కిందట ఈమూర్తిని కోలువుచేశారు. 24వతేదీ ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేతమలయప్పస్వామి , భోగ శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి మనవాళ పెరుమాళ్(శ్రీభోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనులవారిని ఆశీనులు చేస్తారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలో 24వతేదీ ఆర్జిత సేవలన్నీ యథావిధిగా నిర్వహించనున్నారు.

## ఎస్వీ ఆపన్న హృదయట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు తమ వంతుగా విరాళాలందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ సంస్థ గురువారం టిటిడి వేంకటేశ్వర ఆపన్న హృదయ పథకానికి కోటి రూపాయలు విరాళంగా అందించింది. ఆసంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో అధికారులకు చెక్కును అందజేశారు.

## శ్రీవారి కృపతో 'మా ఇంటి బంగారం' విజయం సాధిస్తుంది: నటి సమంత



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మా ఇంటి బంగారం చిత్రం ఘన విజయం సాధిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది.మా ఇంటి బంగారం చిత్ర బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నటి సమంతతోబాటు ప్రముఖ దర్శకుడు రాజ్ నిడమోరు,మా ఇంటి బంగారం చిత్రబృందం ఉన్నారు. నేడు శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తన సరికొత్త చిత్రం మా ఇంటి బంగారం విజయవంతం కావాలని కోరుకుంటూ స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నామన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సమంతకు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



## నాణ్యమైన పప్పు దినుసులు సరఫరా చేయాలి

### పప్పు మిల్లర్లతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో అన్నప్రసాదాల తయారీలో నాణ్యమైన పప్పు దినుసులను వినియోగించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పప్పుమిల్లర్లతో టిటిడి అదనపు ఇఒ చిరు మా మిళ్ళ వెంకయ్య చౌదరి సమావేశమయ్యారు. గత కొన్నేళ్లుగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల నుంచి కూడా నాణ్యతతో పాటు అవసరమైన పరిమాణంలో పప్పు దినుసులు సరఫరా చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల ప్రతినిధులు, ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులకు మహా యజ్ఞంగా అన్నప్రసాదాలు అందిస్తున్న టిటిడి సేవలో భాగస్వాములై, నాణ్యమైన పప్పు దినుసులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం పప్పు మిల్లర్ల నుంచి పప్పు దినుసుల కొను గోలుకు ఉన్న పారదర్శకమైన విధానాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆదేశించారు.గురువారం మధ్యాహ్నం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో సుధర్మ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడికి అవసరమైన పప్పు దినుసుల నాణ్యత, పరిమాణం, సరఫరా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రోజువారీ అన్నప్రసాదాల తయారీలో శనగలు, పొట్టు తీసిన మినుములు, పొట్టుతో కూడిన మినుములు, కందిపప్పు, పెసరపప్పు, వేరుశెనగలు వంటి ఏడు రకాల పప్పు దినుసులను టిటిడి వినియోగిస్తోందని అదనపు ఇఒతెలిపారు. ఈ సమావేశంలో అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, వేర్ హౌసింగ్ డిప్యూటీ ఇఒ పద్మావతి, జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఉమాశంకర్, పోటు ఎఇఒ మునిరత్నం, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి కెఎల్

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు

### కపిలతీర్థంలో టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్నందున కపిలతీర్థం ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఆదేశించారు. కపిలేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను మరింత పటిష్టంగా తీర్చి దిద్దడం, డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు చేపట్టడం, పరిశుభ్రతను మెరుగుపరచడం వంటి అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ బి. నాగరత్న, విఎస్‌ఒ గిరిధర్, డీఇలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, ఇఇలు మల్లికార్జున ప్రసాద్, సుమతి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రసాద్, సూపరింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## గంగమ్మ దర్శనంతో మనసు ఆనందం

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మ దర్శనంతో మనసు ఎంతో ఆనందం కలిగిందని యాంకర్ శ్రీముఖి తెలిపారు. ఇటీవల అమ్మవారికి జాతరలు జరిగాయని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆలయంకు విచ్చేసిన శ్రీముఖికి ఆలయ కమిటీ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఇఒ జయకుమార్ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు, అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



గురువారం గాదె సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అంబటి తదితరులు

# సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలి

## జగన్ ఆదేశం మేరకు అతని కుటుంబానికి అండ: అంబటి రాంబాబు

**విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త:** లాకప్ డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలని మాజీ మంత్రి,వైసిపి నాయకులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం ఆయనతో పాటు వైసిపి నాయకులు మల్లాది విష్ణు,వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్,వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కృష్ణలంకలోని ఇంటి వద్ద తొలుత గాదె సాయికృష్ణ తల్లిని,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయికృష్ణ కుటుంబాన్ని ఇలాంటి సమయంలో పరామర్శించడం చాలా భాధగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై చర్చ జరుగుతోందన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడితే గుండెలవిసిపోయే నిజాలు తెలిసాయన్నారు. సాయికృష్ణ తల్లి ఫోన్ లాక్కొని సిగ్నల్స్ ఆధారంగా సాయికృష్ణను తీసుకువచ్చారన్నారు. తల్లి ఎంత ప్రాధేయపడినా సిఐ నాగరాజు సాయికృష్ణని వదిలేయ లేదన్నారు. వ్యవస్థలు ఎంత దారుణంగా ఉన్నాయో సాయికృష్ణ లాకప్‌డెత్ ద్వారా తెలుస్తోందన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్న సాయికృష్ణ పిన్ని కనకదుర్గ డిజిపి ఒక ఫిర్యాదు ఇచ్చారని, అ ఫిర్యాదు సిపికి అక్కడి నుండి డిసిపి వద్దకు వచ్చి చెత్తబుట్టలో చేరిందని ఆయన విమర్శించారు. ఆ స్టేషన్‌లో ఉన్న వేరే నిందితులు చెప్పిన దాని ప్రకారం సాయికృష్ణను పోలీసులు చంపేశారని తెలిసిందన్నారు. హెబియస్ కార్పస్ పిటీషన్ వేయకుండా కూడా సాయికృష్ణ కుటుంబ సభ్యులకు అనేక ఆటంకాలు పోలీసులు సృష్టించారన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులు చెప్పిన దాని ప్రకారం వారికి అండగా నిలిచామన్నారు. సాయికృష్ణకు క్రిమినల్ సామ్రాజ్యం ఉందని ప్రచారం చేస్తున్నారని అదే నిజమైతే అతని తల్లి గుడిసెలో ఉండి రోజు అడుక్కోవాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లాది విష్ణు,మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి,ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి వివాదంలో మామను చంపిన అల్లుడు

**విజయవాడ,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర శివారుల్లోని కంకిపాడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. మండల పరిధిలోని గోశాల గ్రామంలో కేవలం ఒక స్థలం వివాదానికి సంబంధించి అల్లుడే మామపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోశాల గ్రామానికి చెందిన ఉప్పల సాంబశివరావు (65) అనే వృద్ధుడికి, అతని అల్లుడికి మధ్య కొంతకాలంగా ఒక స్థలానికి సంబంధించిన వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల మధ్య మరోసారి తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవ కాస్తా ముదరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అల్లుడు మామ అని కూడా చూడకుండా సాంబశివరావుపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. అల్లుడు బలంగా కొట్టడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి కన్నుమూశారు.

సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

# జలధారతో జల విజయం

## రాష్ట్ర మంత్రులు మండిపల్లి, జనార్దన్‌రెడ్డి

**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :** జలధారతో జిల్లాకు జల విజయం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాల, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో రెండేళ్ళ నమ్మకం-సుపరిపాలన-అభివృద్ధి సంక్షేమంపై జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమం నీటిసంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్బజలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు కొత్త ఊపు ఇచ్చిందన్నారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్తాయిలోప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే స్తాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండేళ్ళ కూటమి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈసందర్భంగా అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్లు పరిశీలించి అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముళ్లపొదల్లో శిశువు మృతదేహం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:**ఒంగోలు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఓపీఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న శివారు ప్రాంతంలోని ముళ్ల పొదల్లో సుమారు ఏడు రోజుల వయస్సు గల మగ శిశువు మృతదేహం గుర్తించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గురువారం ఉదయం ఆ ప్రాంతంలో సంచరిస్తున్న స్థానికులు ముళ్ల పొదల్లో శిశువు మృతదేహాన్ని గుర్తించి వెంటనే హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయన ఈ విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జిల్లా మహిళా మరియు శిశుసంక్షేమశాఖ అధికారి పి. నాగమణి సూచనల మేరకు జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు,ఒంగోలు తాలూకా పోలీసులు, ఎమ్మెన్కె సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్త అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా ఎస్సై పి.చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# జెఎసి పిలుపునకు సంపూర్ణ మద్దతు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద భారీ ఎత్తున శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధి, ఏ.జి.కె.చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రెండేళ్ల పాలనకు ప్రజా మద్దతు..

## ఒంగోలులో అట్టహాసంగా కూటమి విజయోత్సవ సభ

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఘనంగా విజయోత్సవ సభ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామ చర్ల జనార్ధన్ రావు, ఉగ్రనరసింహారెడ్డి, విజయ్ కుమార్, కలెక్టర్ రాజాబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత సభకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక



స్టాళ్లను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. గత రెండేళ్లలో ప్రకాశం జిల్లాలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు రూ.7,163 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి అందించామని, రూ. 3,068 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంపై ఉన్న భారీ అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే మరోవైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సరఫరా కాలువల కోసం రూ.500 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంత రైతుల దశను మార్చబోతుందని అన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రకాశం జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు వివరించిన ఈ సభ జిల్లాలో రాజకీయంగా, పరిపాలనా పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

## రూ.6.3కోట్లు రుణాల చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 18 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్వయంఉపాధి సాధించి కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలకు కూటమి ప్రభుత్వంలో ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.మహిళలను మహారాణులను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం యోచించి 'పిఎం అజయ్ పథకాన్ని' రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా నేతలు కేంద్రం నుంచి వచ్చిన నిధులను స్వాహా చేసారని పంచాయతీలకు మంజూరు చేసిన నిధులను కూడా కరెంటు చార్జిలకు జమ చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసారన్నారు.

**ప్రధాని ఆశయాలకు అనుగుణంగా..** నేడు రాష్ట్రంలో భారత ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మోదీజీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధన్యత ఇస్తున్నారని సుధీర్‌రెడ్డి వివరించారు.రానున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించారన్నారు.నేడు తాను పిఎం అజయ్ పథకంలో రూ.6.3కోట్ల రుణాల చెక్కును అందించటం గర్వకారణంగా ఉందన్నారు. మహిళలందరూ ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖిరాలను ఆధిరోహించి ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, కామేష్‌యాదవ్, బొల్లినేని జగన్నాథం నాయుడు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధర కెజి రూ.4 తగ్గింపు

## కంపెనీల అంగీకారం, ధరల స్థిరీకరణపై కమిటీ

## రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్‌పి రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సిఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సిఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు:** ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని, కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**సోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులు:** సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20 ధర పెంచాల్సి ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

**ఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీ:** లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎపి ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు

# పొగాకు రైతులను ఆదుకుంటాం

ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు

నో బిడ్... లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ. 200 కంటే తగ్గడానికి వీల్లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

గురువారం రాష్ట్ర సచివా లయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్య మంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమ స్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు.

రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని, ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**రైతుల ప్రయోజనాలే ముఖ్యం:** ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు.

రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంట పెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును సిఎం చంద్రబాబు ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాంనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డివిబి స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడే టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల పలితా విడుదలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏపీ విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేయనున్నారు. మే 25 నుంచి జూన్ 1 వరకుసప్లిమెంటరీ పరీక్షలు జరగ్గా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు ఫలితాలను విడుదలకు సిద్ధం చేశారు. ఫలితాలను ఎపి.జీవోవి.ఇన్/ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. మన మిత్ర వాట్సప్ నెంబరు 9552300009 ద్వారానూ రిజల్ట్స్ తెలుసు కోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు

# ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన జరుగనున్న వైద్య కళాశాలల ప్రవేశ పరీక్ష నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులు తమ నివాసం నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు తమ హాల్ టికెట్‌ను చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లను గుర్తించి అందుకు అనుగుణంగా నీట్ రీఎగ్జామినేషన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ అదనంగా ప్రత్యేక బస్సులు నడపాలని ప్రభుత్వం ఆర్టీసి అధికారులను ఆదేశించింది. అందుకు అనుగుణంగా అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు డిపోల నుంచి పరీక్షా కేంద్రాలకు నిత్యం నడిచే బస్సులకు అదనంగా రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసి కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆసుపత్రుల పనితీరుపై మరింత నిఘా

## రెండేళ్ల ఫలితాలపై ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమార్ యాదవ్ సమగ్ర నివేదిక

**విజయవాడ,జూన్ 18, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచడానికి వైద్యారోగ్య శాఖ చేసిన ప్రయత్నాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంసమగ్రమైన నివేదికను అందజేశారు. నాలుగు పేజీల సమీక్షతో కూడిన లేఖతో పాటు విభాగాలవారీగా సాధించిన ఫలితాలపై 8 పేజీల నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి పంపారు.గత ప్రభుత్వం నుంచి ఆరోగ్య రంగంలో వారసత్వంగా సంక్రమించిన సమస్యల్ని పరిష్కరించి, ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడం ద్వారా మొదటి ఏడాది కంటే రెండో ఏడాదిలో మరింత సానుకూల ఫలితాలు లభించాయని మంత్రి తన లేఖలో ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఏడాదిలో వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు 7 శాతం పెరగ్గా రెండో ఏడాది పాలనలో హాజరు 28.13 శాతం పెరిగిందని, తదనుగుణంగా వైద్య సేవల్లో భారీ పురోగతిని సాధించామని మంత్రి తెలిపారు. విస్తృతమైన ప్రభుత్వ వైద్య సేవలకు సంబంధించి మొత్తమ్మీద సానుకూల ఫలితాలు లభించినా, ఆసుపత్రులవారీగా, ప్రాంతాలవారీగా పనితీరులో వ్యత్యాసాలు కనిపించాయని, వీటిని అధిగమించి వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ప్రజలకు అందజేసే దిశగా చర్యల్ని చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించామని మంత్రి వివరించారు.

# పిడుగుపాటుకు గేదె మృతి

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని చిన్నబ్బీపురం గ్రామంలో గత రాత్రి కురిసిన అకాల వర్షం సమయంలో పిడుగుపాటుకు ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మబ్బు మస్తానయ్యకు చెందిన సుమారు లక్షరూపాయలు విలువ చేసే నిండు సూడుతో ఉన్న గేదె పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు, పశువైద్య శాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం పశువైద్య సిబ్బంది గేదె మృతిపై పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారాన్ని బాధిత రైతుకు అందించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఆక్వా రైతు కృష్ణంరాజు హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్18 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం కొత్త మురమళ్ళలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు(64)ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసినట్లు అనుమానిస్తున్నారు .కృష్ణంరాజు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో గాలించి ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు,పోలీసులు గాలింపు చేపట్టగా చెరువులో రాళ్లతో కట్టిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అమలాపురం డిఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

# తిరుపతిలో జెఎస్ఎస్ క్యాంపస్ ఏర్పాటు

## జెఎస్ఎస్ మహావిద్యాపీఠంతో ప్రభుత్వం ఒప్పందం

### మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఒయు



**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాప్రభుత్వంలో తిరుపతికి మరో ప్రతిష్టాత్మక విద్యాసంస్థ తరలిరానుంది. మైసూరుకు చెందిన జెఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆధ్వర్యంలో తిరుపతిలో జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్‌క్యాంపస్ ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎపి ఉన్నత విద్యామండలి, జెఎస్ఎస్ (జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర మహావిద్యాపీఠం) మహావిద్యాపీఠంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఎపి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జెఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ ఛాన్సలర్ డా.బి.సురేష్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ క్యాంపస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

మైసూరు హెడ్ క్వార్టర్‌గా ఉన్న జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ నాక్ నుంచి ఎ++ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానం, ఓవరాల్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 38వ స్థానాన్ని దక్కించుకుంది. 70యేళ్ల చరిత్ర కలిగిన జెఎస్ఎస్ విద్యాసంస్థకు ఇది ప్రధాన విద్యాసంస్థగా ఉండగా భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. అందుబాటులో 74 కోర్సులు: పతిపాదిత తిరుపతి క్యాంపస్‌లో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 74 కోర్సులు అందు బాటులో ఉండనుండగా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 10 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. అదనంగా హెల్త్‌కేర్‌లో ఎఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, పరిపాలన, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్నాలజీ, హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి రంగాల్లో ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడుగా విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులో పరిశ్రమల అనుసంధాన కేంద్రాలు కూడా నెలకొల్పనున్నారు. 20వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి కల్పన: ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో భూమి కేటాయింపు, అవసరమైన చట్టబద్ధ అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. క్యాంపస్ అభివృద్ధికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని జెఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరించడంతో పాటు యుజిసి నుంచి అవసరమైన అనుమతులను పొందనుంది. అమలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు 60 రోజులలోపు జాయింట్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధకులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ సంస్థ తోడ్పాటును అందించనుంది. ఈ కార్యక్రమంలో మైసూరు జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ రిజిస్ట్రార్ డా. బి.మంజునాథ, జెఎస్ఎస్ ఎహెచ్ఇఆర్ డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కెపిఎంపి అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్, స్పెషలిస్ట్ రోమిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయపరంగా అండగా ఉంటాం

## సాయికృష్ణ తల్లిని పరామర్శించిన జగన్



**విజయవాడ. జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ కేసులో పార్టీ తరపున న్యాయపరంగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం కృష్ణ లంకలో సాయికృష్ణ నివాసానికి వెళ్లారు. అక్కడ సాయి తల్లిని, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయి అదృశ్యం పోలీసుల వైఖరిపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. **మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీ నాని:** ఈ ఘటన పైన జాతీయ మానవ హక్కుల సంఘానికి మాజీ ఎంపీ కేశినేని నాని ఫిర్యాదు చేయటం సంచలనంగా మారుతోంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణపై గతంలో కొన్ని కేసులు ఉండటంతో పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయితే పోలీసుల వేధింపులు తట్టుకోలేక అతను ప్రకాశం జిల్లా మార్కాపు రానికి వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా, పాత కేసు విషయమై మే 9, 2026 న విజయవాడ కృష్ణలంకకు చెందిన ఇద్దరు పోలీసులు మార్కాపురం వెళ్లి సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అలా పోలీసులు తీసుకెళ్లిన సాయికృష్ణ మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. అతన్ని ఏ కోర్టులోనూ హాజరుపరచకపోవడంతో కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. దీంతో, కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో తాజా విచారణ నేపథ్యంలో ఒక్క సారిగా ఈ వ్యవహారం కొత్త టర్న్ తీసుకుంది.

# బిసిల వాస్తవ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం

## డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 18, ప్రభాతవార్త :** బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డెడికేటెడ్ కమిషన్ కృషి చేస్తోందని ఆ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గురువారం నెల్లూరులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారుల నుంచి జిల్లాలోని బీసీ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

# రాయలసీమ రాయల్ విక్టరీ

## మిడిలార్డర్ మెరుపులతో కాకినాడ కింగ్స్‌పై ఘన విజయం




మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న తేజ

**కడప స్పోర్ట్స్ (వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియం):** ఏపీఎల్2026 సీజన్5లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. కడపలోని వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై ఉత్కంఠభరిత పోరులో రాయలసీమ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన కాకినాడ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే దూకుడుగా ఆడిన కాకినాడ బ్యాటర్లు పవర్‌ప్లేలో మంచి స్కోరు సాధించారు. 10 ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి అద్భుత సెంచరీ సాధించాడు. 60 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 112 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాట లు వేశాడు. చివర్లో లేకాజ్ రెడ్డి 17 బంతుల్లో 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో కాకినాడ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రాయలసీమ బౌలర్లలో పార్థసారథి, పురుషోత్తం గణేష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్స్ ఆఫ్ రాయలసీమకు ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు త్వరగా వెనుదిరిగినా మిడిలార్డర్ బ్యాటర్లు జట్టును విజయతీరాలకు చేర్చారు. జీవీస్పీ తేజ 43 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 76 పరుగులు చేసి చివరివరకు పోరాడాడు. అతనికి తోడు వై. వాసు 14బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 42 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చాడు. వై. తేజారెడ్డి 27 బంతుల్లో 41 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ముగ్గురి మెరుపు బ్యాటింగ్‌తో రాయలసీమ జట్టు 18.3ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టుకువిజయాన్ని అందించిన తేజకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# నీట్‌కు అప్రమత్తంగా ఉండాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఈనెల 21వతేదీ దేశవ్యాప్తంగా పునఃనిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్య ప్రవేశపరీక్ష 'నీట్' నిర్వహణలో జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్ అవరణలో పింగళి వెంకయ్య సమావేశమందిరంలో గురువారం నీట్ పరీక్ష నిర్వహణపై కోఆర్డినేటర్‌లు, అబ్జర్వర్‌లు, పరీక్షాకేంద్రాల సూపరిటిండెంట్ తదితర పరీక్షకు సంబందించిన అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్దుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, సిబ్బంది భాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 31పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, గతంలో పరీక్షకు 3గంటల సమయం ఉండగా ప్రస్తుతం మరో 15 నిముషాలు అదనపు సమయం కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. 21వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్దులు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు మాత్రమే పరీక్షాకేంద్రంలోపలికి అనుమతి స్తామని స్పష్టం చేసారు. **నందిగామ, తిరువూరులో పీయం అజయ్ మేళాలు :** పీయం అజయ్ పథకం ద్వారా నిరుద్యోగ ఎస్‌సీ యువతకు నైపుణ్యశిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈనెల 19వతేదీ నందిగామ, 20వతేదీ తిరువూరులో మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు.

# ఎఆర్‌టి కేంద్రంలో ఎపిసాక్స్ పిడి తనిఖీలు



**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం(ఏపిసాక్స్) ప్రాజెక్టు డైరెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ విజయవాడలోని పాత ప్రభుత్వవైద్యశాలలోని ఏఆర్‌టి సెంటర్‌ను, ఐసిటిసి కేంద్రాలను గురువారం తనిఖీ చేసారు. ఈసందర్భంగా సోచ్ పోర్టల్‌లో నమోదవుతున్న వివరాలను, రోగుల ఇన్‌వర్డ్ రిజిస్టర్లను పరిశీలించారు. ఐసిటిసి, ఏఆర్‌టి కేంద్రాల్లో పని చేస్తున్న కౌన్సిలర్‌లు, డేటామేనేజ ర్‌లు, ల్యాబ్ టెక్నిషియన్స్, వైద్యఅధికారులతో సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో బిఎస్‌డి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసవర్మ, సిఎస్‌టి డిడి డాక్టర్ ఎస్.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆకాంక్షితబ్లాక్‌లను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి : అశోక్‌బాబు

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్‌జిల్లాలోని ఆకాంక్షితబ్లాక్‌లను ఆదర్శబ్లాక్‌లుగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషిచేస్తున్నట్లు కేంద్రప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. కొటికలపూడిలోని హెల్త్‌అండ్‌విలెనెస్ సెంటర్‌ను, అంగన్వాడికేంద్రాన్ని సందర్శించారు. మహిళాశిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. మూలపాడులో ఉపాధిహామీ పథకం అనుసంధానంతో చేపట్టిన మునగ, నిమ్మ ప్లాంటేషన్ ప్రాంతాల ను, బట్టర్‌ప్లై పార్కును సందర్శించారు. కొండపల్లిలో బాలికల ఉన్నత పాఠశాలతోపాటు, గుంటుపల్లి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు ఇస్తున్న శిక్షణాకార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆయన యంపిడిఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500పైగా బ్లాక్‌లను ఆకాంక్షితబ్లాక్‌లుగా ప్రకటించిందని, ఇందులో రాష్ట్రంలోని ఏడుజిల్లాలో 15బ్లాక్‌లు ఉన్నాయన్నారు. ఎన్‌టిఆర్‌జిల్లాలోని ఇబ్రహీంపట్నం,పెనుగంచిప్రోలు బ్లాక్‌లు(మండలాలు) ఉన్నాయని చెప్పారు. ఈరెండుబ్లాక్‌లను పూర్తిస్థాయి అభివృద్దిచేసేందుకు పలుకార్యక్రమాలుచేపడుతున్నట్లు ఆయన వివరించారు.

# తెలంగాణ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ ఎంపీ విజయ్



**విశాఖ, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ని గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. చింతకాయల విజయ్ ఇటీవల నూతనంగా రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ విజయ్ ని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, హృద యపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# నెల్లిమర్లలో వికటించిన పొత్తు ధర్మం

## జనసేన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తీరే కారణం?

### టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



**విజయనగరం, జూన్ 18, ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తు ధర్మం వికటించింది. ఎవరికి వారే యమునా తీరే చందంగా ఇరు పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు సైతం కేవలం జనసేన పార్టీ నాయకులు మాత్రమే దర్శనమిస్తున్నారు. గత రెండేళ్ల కాలంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్న కార్యక్రమాలన్నింటికీ తెలుగుదేశం పార్టీ నాయకులు దూరంగా ఉంటున్నారు. దీనికి కారణం ఎమ్మెల్యే నాగ మాధవి, ఆమె భర్త లోకం ప్రసాద్ ఏకపక్షంగా వ్యవహరించడం, ప్రధాన పొత్తు పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ నాయకులతో కనీస సంప్రదింపులు సైతం చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించారు. నియోజకవర్గ ఓట్లలో కనీసం 10 శాతం కూడా ఓటర్లు లేని జనసేన పార్టీకి టికెట్ ప్రకటించడంపై అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్రుమన్నారు. అధినాయకుల నిర్ణయం ఉపసంహరించుకోవాలని టిడిపి నుంచి పదే పదే విజ్ఞప్తులు వెళ్లినా అధిష్టానం ముందు తీసుకున్న నిర్ణయానికే కట్టుబడింది. దీంతో ఏమి తోచని పరిస్థితుల్లో తెలుగుదేశం నాయకులు అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి జనసేన పార్టీ అభ్యర్థి లోకం నాగమాధవిని గెలిపించడంలో కీలక భూమిక పోషించారు.

# సూర్యఘర్‌తో ఇళ్లకు సౌర విద్యుత్

## ఎమ్మెల్యేల దృష్టికి ఆర్డీఎస్ఎస్ అభివృద్ధి పనులు

**చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:** సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధ్యక్షతన విద్యుత్ సంస్కరణల అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్ఇ అమరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు వేర్వేరు విద్యుత్ లైన్లు ఏర్పాటుతో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రూ.468.33 కోట్ల వ్యయంతో చేపట్టిన 11కెవి ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో ఇప్పటి వరకు రూ.241.52 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు.

# నేడు మేధా టవర్స్ లో ఈ ఇంక్యుబేటర్ ప్రారంభించనున్న చండీగఢ్ యూనివర్సిటీ

**విజయవాడ, జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని అంతర్జాతీయ స్థాయి క్వాంటం డీప్‌టెక్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చటమే లక్ష్యంగా మరో కీలకమైన ముందడుగుపడింది. డీప్ టెక్ స్టార్టప్ లకు సహ కారం అందించేలా మొట్టమొదటి క్వాంటం ఇంక్యుబేటర్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభంకానుంది. చండీగఢ్ యూనివర్సిటీ తొలి క్వాంటం ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 19 తేదీన గన్నవరం లోని మేధా టవర్స్ లో ఈ

# వాడిన మద్యం సీసాల నిర్వహణపై సర్క్యులర్ ఎకానమీ విధానాల పరిశీలన

**విజయవాడ, జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఎక్సైజ్ విధానాలపై సూచనలు చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జీవోఎం) సమావేశం గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎక్సైజ్, గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అసెంబ్లీలో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమావేశం

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీలో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమావేశం ఆ కమిటీ ఛైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార, రైతు సంక్షేమ రంగాలు, పశు సంవర్ధక, మత్స్య, వెటర్నరీ, సామాజిక సంక్షేమ సంస్థల పని తీరుపై చర్చించారు. ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ కార్యకలాపాలు, సెరిఫెడ్, రైతు సాధికార సంస్థల పురోగతిపై కమిటీ ఆరా తీశారు. రేపు మరిన్ని సంస్థలపై చర్చలు ఉంటాయని కూన రవికుమార్ వెల్లడించారు.

# డిఎస్సీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు

## లోక్‌భవన్‌లో గవర్నర్‌తో వైఎస్సార్సీపీ నేతల భేటీ

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** డిఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ విజయవాడ లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వైయస్సార్‌సీపీ ప్రతినిధులు కలిసారు. మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, ఎంవీ రామచంద్రారెడ్డి, మొహమ్మద్ రుహుల్లా, డీఎస్సీ ప్రక్రియపై గవర్నర్ దృష్టికి పలు అంశాలను వైఎస్సార్సీపీ నేతలు తీసుకెళ్లారు.

# సత్యవేడు సబ్‌జైలు మూత

## భద్రతా లోపాలే కారణమంటూ ఖైదీలను చిత్తూరుకు తరలింపు..?

**సత్యవేడు, జూన్ 18 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణానికి మరో కీలక ప్రభుత్వ సంస్థ దూరమైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన సత్యవేడు సబ్‌జైలు మంగళవారం నుంచి అధికారికంగా మూత పడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జైలు భవనం శిథిలావస్థకు చేరుకోవడం, పైకప్పు దెబ్బతినడం, ప్రహరీగోడలు పటిష్టంగా లేకపోవడం వంటి భద్రతా లోపాలను గుర్తించిన జైలు శాఖ ఉన్నతాధికారులు జైలును మూసివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జైలులో ఉన్న ఏడుగురు రిమాండ్ ఖైదీలను కట్టుదిట్టమైన భద్రతల మధ్య చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఇకపై సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో నమోదయ్యే కేసుల్లో రిమాండ్‌కు వెళ్లే నిందితులను చిత్తూరుకు తరలించాల్సి ఉంటుంది. ఒక్క రిమాండ్ ఖైదీని చిత్తూరుకు తరలించాలన్నా కనీసం ఇద్దరు పోలీసు సిబ్బంది బందోబస్తుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సత్యవేడు సర్కిల్ పోలీసుశాఖకు ఇది మరింత భారంగా మారనుంది. సత్యవేడు సబ్‌జైలు తొలగింపు గురించి గత రెండేళ్లుగా ప్రచారం జరిగినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు జైలు బలోపేతం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఇంద్రకీలాద్రి విస్తరణకు సమీక్ష

**ఇంద్రకీలాద్రి, జూన్ 18, ప్రభాతవార్త :** దుర్గమ్మవారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి విస్తరణ దిశగా వడి వడి అడుగులు పడుతున్నాయ్! భూసేకరణ పరిధిలోకి వచ్చే గృహ నిర్వాసితులతో ఆర్‌డిఓ వెన్నెల శ్రీను, ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆర్అండ్‌బి ఎస్ భాస్కరరావు, దేవదాయ శాఖాధికారులు సమావేశంలో మాట్లాడారు. అర్జున వీధిలో 5 గృహాలు, మల్లికార్జున పేట (ఉత్తరం మెట్ల వైపు) 12 గృహాలు, మల్లికార్జున పేట (కొండపైన) 5 గృహాలు ఈ భూ సేకరణకు సంబంధించి ముందస్తుగా సమాచారం అందుకున్న ఆయా గృహ యజమానులు మరియు నిర్వాసితులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ విస్తరణ ప్రక్రియలో నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఆలయాభివృద్ధి పథకానికి విజయవాడకు చెందిన హెచ్ భాగ్యలక్ష్మి రూ.2,00,000లు విరాళమును ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆవూరి శ్రీనివాసరావుకు అందజేశారు.

దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకవైపు అభివృద్ధి,మరోవైపు సంక్షేమం చేస్తున్నారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. మండలంలోని దామరమడుగు జడ్‌పి హైస్కూల్‌లో విపిఆర్ పౌండేషన్ నిధులు 30 లక్షలతో నిర్మించిన నూతన తరగతిగదులను ఎమ్మెల్యే గురువారం ప్రారంబించారు. అంతకు ముందు దామరమడుగు పల్లిపాళెం వద్ద 17 లక్షలతో నిర్మించిన శ్లాబ్ కల్వర్ట్ ,10 లక్షలతో మంజూరైన సిసిరోడ్డు,జలజీవన్ మిషన్ నిదులు 7.68 లక్షలతో చేపట్టిన పైపు లైన్లు తాగునీటి కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌బాబు విద్యార్దులకు ఎన్నో ఆధునిక వసతులతో విద్యాబోధన కల్పిస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య , బుచ్చి రూరల్ బ్యాంకు అధ్యక్షులు ఏటూరు శివరామ కృష్ణారెడ్డి, జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, రూరల్ అధ్యక్షులు జగదీష్, శేషయ్య, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు,ఆర్ఐ శాంతి, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా, నీటి సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భూములిచ్చిన రైతులకు త్వరలోనే పరిహారం ఇస్తాం

## పేరూరు ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హామీ

**అనంతపురం, జూన్ 18 ప్రభాతవార్త బ్యూరో:** పేరూరు ప్రాజెక్ట్‌కు నీరందించే పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ కోసం భూములిచ్చిన ప్రతి రైతుకు త్వరలోనే పరిహారం అందిస్తామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో కలిసి రామగిరి, కనగానపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా కనగానపల్లి మండల కేంద్రంలోని రెడ్డివారి కుంట చెరువు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ చెరువు మరమ్మతులకు ఇప్పటికే రూ.86లక్షలు విడుదల చేయగా.. ఈ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. గతంలో చెరువు కట్ట తెగి పొలాలకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా..ఉపాధి హామీ పథకం కింద అక్కడ పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతు శ్రీనాథ్ సాగు చేసిన వేరుసెనగ పంటను పరిశీలించారు. పంట ఎప్పుడు వేశారు.. ప్రస్తుతం ఎలా ఉంది.. దిగుబడి ఎంత వస్తుందన్నది తెలుసుకున్నారు. ఆ తర్వాత జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు ప్రాజెక్ట్) వరకు జరుగుతున్న 54కిలోమీటర్ల పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ పనులను పరిశీలించారు.

# ఆదురుపల్లిలో భారీగా అక్రమ యూరియా నిల్వలు సీజ్

## రూ.12.89 లక్షల విలువైన స్టాక్ గుర్తింపు

**చేజర్ల (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త :** చేజర్ల మండలం ఆదురుపల్లి గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా నిల్వ ఉంచిన భారీ యూరియా నిల్వలను అధికారులు గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ అక్రమ నిల్వలు బయటపడ్డాయి. అధికారుల కథనం ప్రకారం.. ఆదురుపల్లి గ్రామంలోని శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ షేక్ సుభాని ఏవో పి.వేణుగోపాల్‌రావు, స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి హిమబిందు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువుల దుకాణంలో రికార్డులకు, అక్కడ ఉన్న నిల్వలకు పొంతన లేకపోవడాన్ని అధికారులు గమనించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి కంటే అదనంగా ఉన్న 1,423 యూరియా బస్తాలను అధికారులు గుర్తించారు. పట్టుబడిన ఈఅదనపు స్టాక్ విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 12,89,847 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచినందుకు గాను సదరు శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రైతులకు ఇబ్బంది కలిగించేలా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చ రించారు.

# పేదలందరికీ ఇళ్లు: మంత్రి పార్థసారథి

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అదే విధానాన్ని ఇప్పుడు మరింత వేగంగా అమలు చేస్తున్నామని వివరించారు. రెండేళ్ల గృహనిర్మాణ శాఖ ప్రగతిపై మంత్రి కొలుసు పార్థసారధి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో గృహ నిర్మాణానికి అవసరమైన నిధులు సరైన స్థాయిలో విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. వివిధ దశల్లో ఉన్న దాదాపు 4 లక్షల ఇళ్ల ప్రాజెక్టులు రద్దు చేశారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 15.54 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. జగన్ హయాంలో నిలిపివేసిన గృహ నిర్మాణాలను తిరిగి ప్రారంభించి, ఇప్పటికే 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించినట్లు మంత్రిపార్థసారథి పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన 4.14 లక్షల ఇళ్లను కూడా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు.

# విశాఖపట్నం రేంజ్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనకు బహుముఖ వ్యూహం

**విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం' నిర్మాణంలో భాగంగా విశాఖపట్నం రేంజ్ పోలీస్ శాఖ చారిత్రాత్మక విజయాలను నమోదు చేస్తోంది ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని స్థాపించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ జులై 2024లో తాము నిర్దేశించుకున్న సున్నా సాగు చారిత్రాత్మక లక్ష్యాన్ని జనవరి 2026 నాటికి నూటికి నూరు శాతం సాధించగలిగాము అని తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న ముఖా సొత్తు: 65,560 కిలోల గంజాయి, 83.19 కిలోల హాషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకొని, రవాణాకు ఉపయోగించిన 832 వాహనాలను సీజ్ చేసామన్నారు. 19 కేసుల్లో 18 మంది నిందితులకు చెందిన రూ.11.02 కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామని తెలిపారు. కఠిన నిర్బంధ చర్యలు ... పునరావృత నేరస్థులపై కఠిన చర్యల్లో భాగంగా 132 మందిపై ప్రతిపాదనలు పంపగా, 51 మందిని ఇప్పటికే నిర్బంధించామని. అలాగే 1,942 హిస్టరీ షీట్లు తెరిచామని చెప్పారు.




## హ్యాట్రిక్ కొట్టిన హాకీ అమ్మాయిలు

**అక్లాండ్, జూన్ 18:** న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3–2 తేడాతో భారత్ విమెన్ టీమ్ గెలుపొందింది.ఇరు జట్ల మధ్య ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్ ఆరంభంలో ఉరుగ్వే ఆధిక్యం కనబరిచింది. 13వ నిమిషంలో కియారా అపెన్నినో గోల్‌తో ఉరుగ్వే 1–0 ఆధిక్యం చాటింది. ఆ తర్వాతి నుంచి భారత్ అటాక్ పెరిగింది. 24వ నిమిషంలో దీపిక సెహ్రావత్ గోల్ చేసి 1–1తో సమం చేసింది. అనంతరం 43వ నిమిషంలో దీపిక సోరెంగ్ చేసిన గోల్‌తో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక 55వ నిమిషంలో ఉరుగ్వే గోల్ చేసి స్కోరును 2–2తో సమం చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఆతర్వాతి నిమిషంలోనే దీపిక సెహ్రావత్ అద్భుతమైన గోల్ తో భారత్‌ను 3–2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. సెహ్రావత్‌కు ఇది రెండో గోల్. అదే ఆధిక్యాన్ని చివరి నిమిషం వరకు కాపాడుకుని భారత్ గెలుపొదింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత విమెన్ టీమ్... అమెరికా, జపాన్‌లను ఓడించి సెమీస్‌కు దూరుకెళ్లింది. ఈ గెలుపుతో గ్రూపు దశను అజేయంగా ముగించిన భారత్... శనివారం చిలీతో సెమీస్‌లో తలపడనుంది.

## మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు

**రోటర్‌డామ్(నెదర్లాండ్స్), జూన్ 18:** భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్



మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమం లో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. మన్‌ప్రీత్‌కు భారత హాకీ జట్టు కూడా గుర్తిండిపోయే కానుక ఇచ్చింది. ప్రో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ జర్మనీపై 3–1 గోల్స్‌తో నెగ్గింది.

అరుదైన మైలురాయి అందుకున్న మన్‌ప్రీత్ సింగ్‌ను హాకీ ఇండియా అభినందించి, 10 లక్షల నజరానా ప్రకటించింది. 15యేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్ సింగ్... టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టు సభ్యుడు.ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ సింగ్ ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ మైలురాయిని తన సహచరులు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నట్లు మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌ల్లో ఆడడం గర్వంగా ఉందని... ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని స్పష్టంచేశాడు.



## ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి

**గ్వియాంగ్(చైనా), జూన్ 18:** చైనాలోని గ్వియాంగ్‌లో జరుగుతున్న పప్రపంచ కప్ బాక్సింగ్‌లో భారత బాక్సర్ మీనాక్షి హూడా సత్తా చాటుతోంది. ప్రస్తుతం మహిళల 48 కిలోల విభాగంలో వరల్డ్ నెంబర్ వన్ అయిన మీనాక్షి... 51 కిలోల విభాగంలోకి మారి పోటీపడుతోంది. గురువారం మహిళల 51 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో పోలాండ్ బాక్సర్ నటాలియా కుచ్వెస్కాపై పడిగుద్దులతో విరుచుకుపడింది. 5–0తో ఏకపక్ష విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాతో మీనాక్షి హూడా తలపడనుంది. కాగా మరో భారత భాక్సర్ అభినాష్ జమ్వాల్ పరుషుల 65 కిలోల విభాగంలో ఇంటిదారి పట్టాడు. అతను కిర్గిజిస్థాన్ బాక్సర్ మిర్జోఖిద్ చేతిలో 0–5తేడాతో ఓటమి పొందాడు.

భారత బాక్సర్లు రెండు విభాగాల్లో పతకాలు పక్కా చేశారు. మహిళల 48 కిలోల విభాగంలో జ్యోతి, 85 కిలోల విభాగంలో జుగ్నూ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా భారత్‌కు పతకాలను ఖాయం చేసుకున్నారు.కాగా ఈ బాక్సింగ్ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 55 కిలోల విభాగంలో నిఖిల్, 70 కేజీల విభాగంలో దీపక్, 57 కిలోల విభాగంలో ప్రాచి, 65 కిలోల విభాగంలో సనేహా క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.



గోల్ కొట్టి సంబరాలు జరుపుకున్న లూయిస్ డియాజ్

### పనామా ఆశలకు ఘనా చెక్ * మెక్సికోతో తలపడనున్న దక్షిణ కొరియా * కెనడాతో ఖతర్ ఢీ

## సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, కొలంబియా అదుర్స్

**లాస్‌ఏంజిల్స్, జూన్ 18**

ఇంగ్లాండ్ ఘనవిజయంతో ఫీఫా ప్రపంచకప్ జైత్రయాత్రను ప్రారంభించింది. క్రొయేషియాను 4–2తో చిత్తు చేసింది. హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో జట్టు విజయంలో కీరోల్ పోషించాడు. మరో వైపు 8 ఏళ్ల తర్వాత ఫిఫా బరిలోకి దిగిన కొలంబియా రీ ఎంట్రీ అదిరింది. ఉజ్బెకిస్థాన్‌పై 3–1 గోల్స్‌తో నెగ్గింది.ఇక అదనపు సమయం గోల్‌తో పనామాపై ఘనా విజయం సాధించింది. ఇక గ్రూప్–బిలో స్విట్జర్లాండ్‌తో బోస్నియా- హెర్జెగోవినా, అతిథ్య కెనడాతో ఖతార్, గ్రూప్–ఎలో మెక్సికోతో దక్షిణ కొరియా తలపడనుంది.

**అదరగొట్టిన ఇంగ్లాండ్**

హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్... తొలి మ్యాచ్‌లో క్రొయేషియాను చిత్తు చేసింది. స్టార్ ఆటగాడు హ్యారీ కేన్ 12వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో గోల్‌కొట్టి ఇంగ్లాండ్‌కు ఆధిక్యం అందించాడు. అయితే, క్రొయేషియా ప్లేయర్ మార్టిన్ బతురినా 36వనిమిషంలో చేసిన గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. మళ్లీ 42వ నిమిషంలో హ్యారీ కేన్ చేసిన రెండో గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యం 2–1కు పెరిగింది. తొలి అర్థభాగం అదనపు సమయంలో (45+5వ నిమిషం) పీటర్ ముసా అద్భుతమైన గోల్‌తో క్రొయేషియాను 2–2తో సమంగా నిలిపాడు. రెండో అర్థభాగంలో ఇంగ్లాండ్ అటాకింగ్ గేమ్‌తో అదరగొట్టింది. జుడె బెల్లిగ్‌హామ్ (47వ నిమిషం), మార్కస్ రాష్‌ఫోర్డ్ (85వ నిమిషం) గోల్స్‌తో ఇంగ్లాండ్ 4–2 తేడాతో క్రొయేషి యాపై విజయం సాధించింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ కేన్... ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్‌ను సమం చేశాడు. మూడు వేర్వేరు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా హ్యారీ కేన్ (2018, 2022, 2026) నిలిచాడు.అతడి కంటే ముందు బెక్‌హామ్ (1998, 2002, 2006) పేరిట ఈ రికార్డు ఉండేది.

**కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ**

గ్రూప్–కేలో జరిగిన మ్యాచ్‌తో కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. ఉజ్బెకిస్థాన్‌పై 3–1 గోల్స్ తేడాతో నెగ్గింది. 8ఏళ్ల తర్వాత ఫిఫా కప్ ఆడుతున్న కొలంబియా గ్రాండ్ విక్టరీ కొట్టింది. మొదటి అర్థభాగంలో డేనియల్ మునోజ్ చేసిన గోల్‌తో కొలంబియా ఖాతా తెరిచింది. తొలి అర్థ భాగం ముగిసేవరకు 1–0ఆధిక్యం నిలుపుకుంది. రెండో అర్థభాగం 60వ నిమిషంలో ఉగ్లీ ఫైజుల్లావ్ అద్భుత గోల్‌తో ఉజ్బెకిస్థాన్ సమవుజ్జీగా నిలిచింది. ఇది ఉజ్బెకిస్థాన్ జట్టుకు ఫిఫాలో తొలి గోల్. దీంతో ఆ జట్టు అభిమానులకు సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాతి ఐదు నిమిషాల్లోనే డియాజ్ గోల్ సాధించడంతో మళ్లీ కొలంబియా అధిక్యంలోకి వెళ్లింది. ఇక ఇంజ్యూరీ టైమ్ చివరి నిమిషాల్లో కుచో హెర్నాండెజ్ కుడి వింగ్‌లో బంతిని సబ్స్ట్యూట్ కాంపాజ్‌కు క్రాస్ చేయగా అతను హెడర్‌తో గోల్‌లోకి పంపించాడు. ఈ విజయంతో కొలంబియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి. డానియల్ మునోజ్ (40వ నిమిషం), లూయిస్ డియాజ్ (65వ నిమిషం), జామిన్‌టన్ క్యాపాజ్ (90+9వ నిమిషం) కొలంబియా తరఫున గోల్స్ కొట్టారు.

**ఘనామైన విజయం**

సాకర్ ప్రపంచకప్‌ను ఘనామైన విజయంతో ప్రారంభించింది. పనామాపై ఏకైక గోల్‌తో విజయం సాధించింది. స్టార్ ఆటగాడు థామస్ పార్టీ లేకున్నా ఘనా చక్కగా పోరాడింది. పనామాను




బెక్‌హమ్‌ను సమం చేసిన హ్యారీ కేన్

నిలువరించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఆట అదనపు సమయంలో ఘనా ప్లేయర్ కలేబ్ (90+5వ నిమిషం) గోల్ సాధించాడు. దీంతో డ్రా చేద్దామనుకున్న పనామా ఆశలకు తెర పడింది.

## ఐదో రోజూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి,జూన్ 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్లోనూ లాభాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సడలడం మార్కెట్ సెంటిమెంట్కు బలాన్నిచ్చాయి. హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లు కొనుగోళ్లతో పెరిగితే, ఐటీ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, అమెరికాఇరాన్ శాంతి చర్చలపై సానుకూల సంకేతాలు, ఎఫ్‌పిఐల కొనుగోళ్లు పునరుద్ధరించటం, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు పెరిగి 77,409.98వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 82.30 పాయింట్లు 24,168 వద్ద స్థిరపడింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4.85 పెరగగా,నిఫ్టీ 4.35 ఎగబాకింది. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ 6.46లాభం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ 1.74శాతం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.56 చొప్పున పెరిగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.41 పెరిగితే బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 లాభపడింది.




## పసిడి వెండి ధరలపై ఫెడ్‌రిజర్వు ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, జూన్ 18:**అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ బంగారం ధరలు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడంలేదు.అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధాన సంకేతాలు ఇవ్వడంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.గురువారం స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,270 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, రోజులో గరిష్ఠంగా 4,330 డాలర్లను తాకింది. మరోవైపు స్పాట్ సిల్వర్ 68.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, సెషన్‌లో 69.85 డాలర్ల వరకు పెరిగింది. అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం,హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణ ఆందోళనలు కొంత తగ్గి బంగారం, వెండి కొనుగోళ్లకు మద్దతు లభించిందని కోటక్ సెక్యూరిటీస్ విశ్లేషించింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ, ఈ ఏడాది చివర్లో మరోసారి రేట్ల పెంపు అవకాశం ఉందని సంకేతాలు ఇవ్వడంతో బులియన్ మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.




## ధరలు పెంచుతున్న టాటా మోటార్స్

**ముంబయి,జూన్ 18:**దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటామోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నటువెల్లడించింది. ట్రక్కులు, బస్సులు సహా కమర్షియల్ వాహనాల శ్రేణిలో గరిష్ఠంగా 2.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ధరలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని కొంత మేర భర్తీ చేసేందుకు ధరల సవరణ చేపడుతున్నట్లు కంపెనీ వివరించింది.ధరల పెంపు అన్ని వాహనాలపై ఒకేలా ఉండదని తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెరుగుదల మారుతుందని పేర్కొంది. ఇదే నెల ప్రారంభంలో టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహనాల ధరలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై 1.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు స్పష్టంచేసింది. ఆ పెంపు కూడా వచ్చే నెల నుంచే అమల్లోకి రానుంది. ఇటీవల ముడి పదార్థాల ధరల పెరుగుదల, నిర్వహణ వ్యయాల భారం కారణంగా పలు ఆటో కంపెనీలు ధరలను సవరించాయి. గత నెలలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచగా, మారుతి సుజుకి కూడా ఈ ఏడాది ప్రారంభంలో పలు మోడళ్ల ధరలను పెంచింది.

## ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ,జూన్ 18:**ఉద్యోగుల భవిష్య నిది సంస్థ డిజిటల్ సేవలను మరింత విస్తరిస్తోంది.ఈపీఎఫ్‌వో 3.0 కింద పీఎఫ్ ఖాతాదారులు యూపీఐ యాప్‌లు, పీఎఫ్‌కు అనుసంధానమైన ఏటీఎంల ద్వారా నేరుగా తమ నిధులను ఉపసంహరించుకునే సౌకర్యాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకువస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ఆఫ్ఇండియా(ఎన్‌పీసీఐ) సహకారంతో రూపొందించిన ఈ వ్యవస్థకు సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయ్యాయి. కొత్త విధానంలో పీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తంలో 75 శాతం వరకు నిధులను వెంటనే బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ దాఖలు చేసి, ఆమోదం కోసం కొంత కాలం వేచి చూడాల్సి వస్తోంది.కొత్తవ్యవస్థ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ మరింత సులభం, వేగవంతం కానుంది.ఈమార్పుతో ఉద్యోగులకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక సహాయం అందుబాటులోకి వస్తుంది. అదే సమయంలో పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. అయితే పదవీ విరమణ నిధుల భద్రత దృష్ట్యా పటిష్ఠమైన ధ్రువీకరణ, మోసాల నివారణ వ్యవస్థలు అవసరమని వారు సూచిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ సాధించిన పురోగతిని సామాజిక భద్రతా వ్యవస్థలకూ విస్తరించే ప్రయత్నంగా ఈపీఎఫ్‌వో 3.0ను భావిస్తున్నారు.

## బ్రిటిష్ కార్ల దిగుమతులకు రాయితీ సుంకం

**న్యూఢిల్లీ, జూన్ 18:** భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమలులో భాగంగా, వచ్చే 15 ఏళ్లలో బ్రిటన్ నుంచి 3.78 లక్షల సంప్రదాయ ఇంధన (పెట్రోల్, డీజిల్) కార్ల దిగుమతులకు భారత్ కస్టమ్స్ రాయితీ సుంకాలను అనుమతించింది. ఈ ఒప్పందం జూలై 15 నుంచి అమల్లోకి రానుంది. ఆటోమొబైల్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న సుమారు 110 శాతం దిగుమతి సుంకం దశలవారీగా 10 శాతానికి తగ్గనుంది. ఇరు దేశాలు కోటా విధానాన్ని అనుసరించనున్నాయి.

సీఈటీపీ పత్రాల ప్రకారం, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే సంప్రదాయ ఇంధన కార్ల కోటా ఐదో ఏడాదికి గరిష్టంగా 37వేల యూనిట్లకు చేరుతుంది. అనంతరం కస్టమ్స్ సుంకం 10 శాతం వద్ద స్థిరపడుతుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

# ఉభయసభల్లో మెజార్టీ దిశగా బిజెపి



**న్యూఢిల్లీ,జూన్ 18:** లోక్‌సభలో పూర్తి ఆధిపత్యం సాధించాలన్న లక్ష్యంతో ఉన్న ఎన్‌డియేకు ప్రతిపక్ష పార్టీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కలిసి వస్తున్నాయనడానికి వివిధ రాష్ట్రాల్లో కనిపిస్తున్న తిరుగుబాట్లు, పార్టీఫిరాయింపులు, విలీనాల చర్చలు చూస్తే నిజమనే సంకేతాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడొంతుల మెజార్టీ (362 ఎంపిలు) సాధించే దిశగా అధికార కూటమి క్రమంగా ముందుకు వెళ్తోందన్న చర్చజోరందుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడువంటి కీలక రాష్ట్రాల్లో బిజెపి ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో బిజెపి సొంతంగా 240 స్థానాలకే పరిమితమైంది. ఎన్‌డియే బలం 293కు చేరినా, మూడొంతుల మెజార్టీకి అవసరమైన సంఖ్యకు ఇంకా దూరంగానే నిలిచింది. ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు వేగంగామారుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు ఎంపీలు పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిలో 20 మంది ఎంపీలు విడిపోయి కొత్త రాజకీయ వేదికలో చేరే అవకాశాలపై చర్చ నడుస్తోంది. ఈ వర్గం ఎన్‌డియేకు మద్దతు ఇచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అదే జరిగితే అధికార కూటమి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యుబిటి)లోనూ సంక్షోభం నెలకొంది. పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని స్పీకర్‌కు లేఖ రాయడం కలకలం రేపింది. దీనిపై స్పందించిన పార్టీ నేత సంజయ్ రౌత్.. ఎంపీలను కొనుగోలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒక్కో ఎంపీకి భారీ మొత్తాలు ఆఫర్ చేశారని కూడా వ్యాఖ్యానించారు. ఈ తిరుగుబాటు నేతలు ఎన్‌డియేకు దగ్గరవుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీలో చీలిక వస్తుందంటూ ప్రచారం సాగుతోంది. రాష్ట్ర మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు దీనికి మరింత ఊతమిచ్చాయి. అయితే ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఈ ప్రచారాన్ని ఖండించారు. పార్టీ ఐక్యంగానే ఉందని స్పష్టం చేశారు. తమిళనాడులో డిఎంకేకాంగ్రెస్ సంబంధాల్లో దూరం పెరుగుతోందన్న వార్తలు కూడా రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ఈ పరిస్థితిని బిజెపి అవకాశంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై డిఎంకే అధికారికంగా స్పందించ లేదు. లోక్‌సభతో పాటు రాజ్యసభలోనూ ఎన్‌డియే బలం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా ఎన్నికల తర్వాత అధికార కూటమి సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా. బెంగాల్‌లో ఖాళీ అయిన కొన్ని స్థానాలుకూడా బిజెపి ఖాతాలో పడే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఇవన్నీ రాజకీయ చర్చల దశలోనే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీల్లో అసంతృప్తి, తిరుగుబాట్లు నిజంగా ఎన్‌డీయేకు సంఖ్యాబలం పెంచుతాయా లేక ఇవి కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోతాయా అన్నది రానున్న రోజుల్లో స్పష్టత వస్తుందని నిపుణుల అంచనా.




## భారత్‌కు చేరువవుతున్న జి-7 కూటమి

**న్యూఢిల్లీ,జూన్ 18:** ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరగడంతో జి7 దేశాలు కూడా మనదేశ అభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ కలిసి జి7 కూటమిగా ఉన్నాయి. ఈ దేశాలే ప్రపంచంలోని సంపన్న ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు పొందాయి. వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, భద్రతా సవాళ్లు, సరఫరా వ్యవస్థల వంటి అంశాలపై నిర్ణయాలుతీసుకునే సమయంలో భారత్‌ను కూడా చర్చల్లో భాగస్వామి చేస్తున్నాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థాయిలో ప్రతిబింబించడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. ఈ దేశాల తరఫున బలంగా మాట్లాడుతున్న దేశంగా భారత్ ఎదిగింది. 140 కోట్లకుపైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో వేగంగా ఎదుగుతోంది. సరఫరా వ్యవస్థలను విస్తరించాలనుకుంటున్న పలు దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారింది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతుండటం పలు దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్నారు. ప్రపంచ వాతావరణ లక్ష్యాలు సాధించాలంటే 140 కోట్ల జనాభా ఉన్న భారత భాగస్వామ్యం తప్పనిసరి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ భారీ పెట్టుబడులు పెడుతోంది. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి అంశాల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తోంది. ఏ ఒక్క కూటమికీ పూర్తిగా అనుకూలంగా కాకుండా, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తోంది. జీ7 సమావేశాల్లో భారత్ పాల్గొనడం ఇప్పుడు కేవలం ఆహ్వానిత దేశం హోదాకు మాత్రమే పరిమితం కావడం లేదు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, సాంకేతికత, అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలు, పరిష్కారాలను ప్రపంచానికి సూచిస్తోంది.

## ఉద్ధవ్‌థాకరే కూటమిలో తిరుగుబాటు

**ముంబయి,జూన్ 18:** ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబిటి)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చినవారే తమ వాళ్లని, రాని వాళ్లు ద్రోహులని మండిపడ్డారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## నేతల పేర్ల ఉచ్ఛారణలో దోషాలు అసెంబ్లీలో క్షమాపణలు కోరిన గవర్నర్

**చెన్నై,జూన్ 18:** తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇవాళ ఆ రాష్ట్ర అసెంబ్లీని ఉద్దేశిస్తూ ప్రసంగించారు. ఆ సమయంలో ఆయన అనేక మంది తమిళ నేతల పేర్లను ఉచ్చరించారు. అయితే ఆ పేర్లు చదివే క్రమంలో ఆయన ఆ పేర్లను తప్పుగా పలికారు. దీని పట్ల క్షమాపణలు కోరుతున్నట్లు గవర్నర్ అర్లేకర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తమిళ సిద్ధాంతకర్తలు, సామాజిక సంస్కర్తలను ఉద్దేశిస్తూ గవర్నర్ మాట్లాడారు. తన ప్రసంగంలో ఆయన కొందరి పేర్లను ప్రస్తావించారు. పెరియార్ ఈవీ రామస్వామి, కే కామరాజ్, రాణి వేలూ నచియార్, అంజలీ అమ్మాల్ లాంటి ప్రముఖుల పేర్లను ఆయన చదివారు. అయితే ఆ ప్రసంగం చేస్తున్న సమయంలో కొన్ని పేర్లను గవర్నర్ అర్లేకర్ తప్పుగా ఉచ్చరించారు. వాస్తవానికి గోవా రాష్ట్రానికి చెందిన ఆయన తమిళ పేర్లను చదవడంలో కొంత ఇబ్బందిపడ్డారు. తన ప్రసంగంలోని ఓ పేరాను చదివిన తర్వాత ఆయన అకస్మాత్తుగా క్షమాపణలు చెప్పారు. నన్ను క్షమించండి, కొన్ని పేర్లను తప్పుగా చదివినట్లు పేర్కొన్నారు.

## ముగ్గురిని సజీవదహనం చేసిన ఇసుకమైనింగ్ మాఫియా

**కోరియా, జూన్ 18:** చత్తీస్‌ఘడ్‌లో ఇసుక మైనింగ్ వివాదం ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. ఫార్చ్యూనర్ వాహనానికి నిప్పుపెట్టడంతో దాంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు సజీవ దహనం అయ్యారు. కోరియా జిల్లాలో జరిగిన ఈ హత్య ప్లాన్ ప్రకారం జరిగినట్లు తెలుస్తోంది. ట్రక్కుల మధ్య ఫార్చ్యూనర్ వాహనాన్ని ట్రాప్ చేసి, దానిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. మృతుల్లో స్థానిక బిజెపి నేత, మాజీ పంచాయతీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ ఉన్నారు. సోనాహట్ పోలీసు స్టేషన్ పరిధిలోని నౌగెయిన్ గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇసుక మైనింగ్ ఆపరేషన్‌కు చెందిన ఓ సమస్య పరిష్కారం కోసం భరత్ సింగ్ చర్చలకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కానీ అతన్ని ట్రాప్ చేసి చంపారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే నలుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. అక్షత్ త్రిపాఠి, విశాల్ త్రిపాఠి, సత్యప్రకాశ్ త్రిపాఠి, మన్ను త్రిపాఠిలను అదుపులోకి తీసుకున్నారు. ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

## పెళ్లయిన నెలరోజులకే వివాహిత ఆత్మహత్య



**ముంబయి,జూన్ 18:** మహారాష్ట్రలోని ముంబై సమీపంలో ఉన్న అంబర్‌నాథ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహమై 48 రోజులు కూడా గడవకముందే విశాఖ తిల్కర్ అనే 26 ఏళ్ల వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది. వృత్తిరీత్యా వైద్యుడైన ఆమె భర్త, అలాగే అత్తమామలు కలిసి అదనపు కట్నం కోసం ఆమెను మానసికంగా, శారీరకంగా తీవ్రంగా వేధించడమే కాకుండా, ఆమె వ్యక్తిగత స్వేచ్ఛను పూర్తిగా హరిస్తూ ఇల్లంతా నిఘా కెమెరాలు పెట్టి నిరంతరం గమనించేవారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖకు నితిన్‌తిల్కర్ అనే వైద్యుడితో ఏప్రిల్ 30న ఘనంగా వివాహం జరిగింది. పెళ్లయిన తర్వాత కొన్ని రోజులు అంతా బాగున్నట్లు అనిపించినా, ఆ తర్వాత భర్త, అత్తమామలు పెళ్లిలో ఇచ్చిన కానుకలు, మర్యాదలు సరిగ్గాలేవంటూ అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రారంభించారు. పుట్టింటి నుంచి మరికొంత డబ్బు, బంగారు ఆభరణాలు తీసుకురావాలని విశాఖపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఇంతటితో ఆగకుండా ఇంటి లోపల, బయట నిఘా కెమెరాలను అమర్చారు. చివరకు మరణానికి రెండు రోజుల ముందు, పక్కింటి మహిళతో మాట్లాడిందనే నెపంతో భర్త ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఈ వేధింపుల గురించి విశాఖ ఫోన్‌చేసి తనతల్లికి చెప్పుకుని కన్నీరుపెట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు ఆమెను తమ ఇంటికి తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుండగానే, ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందనే వార్త వినాల్సి వచ్చింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శివాజీనగర్ పోలీసులు భర్త నితిన్ తిల్కర్, అత్త, మరిదిపై కేసు నమోదు చేశారు.

## ఒక్కో ఎంపికి 50 కోట్లు ఆఫర్ చేసారు!



### తిరుబాటు ఎంపిలపై సంజయ్‌రౌత్ ఫైర్

**న్యూఢిల్లీ,జూన్ 18:** మహారాష్ట్రలోని శివసేన ఉద్ధవ్ థాకరే వర్గంలో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది. జూన్ 19న పార్టీ 60వ వ్యవస్థాపక దినోత్సవం జరగాల్సి ఉండగా, అంతకంటే ముందే పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఆపరేషన్ టైగర్ పేరుతో సాగుతున్న ఈ రాజకీయ వ్యూహంలో భాగంగా, తమ పార్టీకి చెందిన మొత్తం తొమ్మిది మంది ఎంపీలలో ఆరుగురు విడిపోయి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడటానికి, ఆపై ఏకనాథ్ షిండే వర్గంలో విలీనం కావడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. వీరిలో ఇప్పటికే కనీసం నలుగురు ఎంపీలు తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించడం సంచలనం సృష్టిస్తోంది. మరోవైపు ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఉద్ధవ్ థాకరే వర్గం రంగంలోకి దిగింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి చీలిక వర్గాన్ని గుర్తించవద్దని స్పీకర్‌ను కోరుతూ, అత్యవసరంగా గురువారం ఉదయం ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎంపీలపై విప్ జారీ చేసింది. పార్టీ నమ్మకస్థులైన కీలక నేతలు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ తదితరులు స్పీకర్‌ను కలిసి తమ వాదనను బలంగా వినిపించారు. ఈసందర్భంగా సంజయ్ రౌత్ విలేకరులతో మాట్లాడుతూ తమ ఎంపీలను లొంగతీసుకోవడానికి ఒక్కొక్కరికి రూ. 50 కోట్ల వరకు ఆఫర్ చేశారని, తీవ్రమైన బాహ్య ఒత్తిళ్లు తెస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. జూన్ 22న ఉద్ధవ్ థాకరే పార్టీ పెద్దలందరితో కలిసి ఒక విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం ఏకనాథ్ షిండే తన సీనియర్ నాయకులతో కలిసి ఢిల్లీలోనే మకాం వేసి, తిరుగుబాటు ఎంపీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఎంపీలు ఇంకా లేఖపై సంతకాలు చేయాల్సి ఉండటంతో చిన్నపాటి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ తిరుగుబాటు విజయవంతమైతే పార్లమెంట్‌లో షిండే బలం 13కుచేరి కేంద్రంలోని అధికార కూట మిలో ఆయన పట్టు మరింత పెరగనుంది. 2022 నాటి శివసేన చీలికను గుర్తుకు తెస్తున్న ఈ పరిణామాలు మహారాష్ట్ర రాజకీయాలను ఏ మలుపు తిప్పుతాయో అన్నది లోక్‌సభ స్పీకర్ ఇచ్చే తీర్పుపైనే ఆధారపడి ఉంది.

## కేంద్ర మంత్రి అమిత్‌షాతో యుఎస్ రాయబారి భేటీ



**న్యూఢిల్లీ,జూన్ 18:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఆయన నివాసంలోనే భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియా గోర్ కలుసుకుని విస్తృత చర్చలుజరిపారు. ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ, సరిహద్దు భద్రత, నేరస్తులపై సంయుక్త చర్యలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం ఫ్రాన్స్‌లోని జీ 7 సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయిన మరుసటి రోజే జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. భేటీ అనంతరం సెర్గియో గోర్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ హోంమంత్రి అమిత్ షాతో అద్భుతమైన సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, మాదకద్రవ్యాలు, అక్రమ డ్రగ్స్ నుంచి ప్రజలను రక్షించడం, సరిహద్దుల భద్రతను బలోపేతం చేయడం, రెండు దేశాల్లో నేరస్తులను న్యాయస్థానం ముందుకు తీసుకురావడంలో సహకారాన్ని మరింత పెంచే అంశాలపై ఫలవంతమైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. జీ7 సదస్సు సందర్భంగా ట్రంప్‌తో సమావేశమైన మోడీ.. భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాలపై కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అభినందించినట్లు మోడీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు హార్ముజ్ జలసంధి తెరిచి ఉండటం అత్యంత కీలకమని, సముద్రయాన సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కిచెప్పారు.

## పాకిస్థాన్‌లో సిక్కు జంట హత్య

**కరాచి,జూన్ 18:** పాకిస్థాన్‌లో ఒక సిక్కు జంట దారుణ హత్యకు గురైంది. గురుద్వారాను నిర్వహిస్తున్న దంపతుల్ని దుండగులు కాల్చిచంపారు. ఈ ఘటన పాకిస్తాన్‌లోని ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్, మర్దాన్ జిల్లా, బాబూ మొహల్లాలో జరి గింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కడ ఒక గురుద్వారాను జగన్నాథ్, అస్మావాంటి అనే సిక్కు దంపతులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆ గురుద్వారాలోకి దుండగులు ఆయుధాలతో ప్రవేశించారు. సిక్కు దంపతులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన దంపతులు అక్కడికక్కడే మరణించారు. అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దీనిపై మర్దాన్ జిల్లా పోలీస్ అధికారి మసూద్ అహ్మద్ స్పందిస్తూ విచారణ జరుగుతోందని, నిందితుల్ని పట్టుకుంటామని తెలిపారు. అలాగే, ఈ కాల్పులకు గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనను స్థానిక సిక్కు ప్రజలు, సంఘాలతోపాటు రాజకీయ నేతలు కూడా ఖండించారు. ఖైబర్ పక్తుంఖ్వా స్పీకర్ సురేష్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి సిసిటివిలో రికార్డైన దృశ్యాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## డార్క్‌వెబ్‌గా మారుతున్న టెలిగ్రామ్

### ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్




**న్యూఢిల్లీ,జూన్ 18:** టెలిగ్రామ్‌కు ఉచ్చు బిగుస్తోంది. కేంద్ర ప్రభుత్వం మెసేజింగ్ ఫ్లాట్‌ఫారమ్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో పరీక్ష పూర్తయ్యే వరకు టెలిగ్రామ్‌పై కేంద్రం బ్యాన్ విధించింది. ఈ నిర్ణయాన్ని ఛాలెంజ్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనికి ప్రతిగా ఈ యాప్ 'డార్క్ వెబ్'గా మారిందంటూ కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇది ప్రభుత్వం నుంచి తప్పించుకోవడానికి సైబర్ మోసగాళ్లు, తీవ్రవాద గ్రూపులు, ఇతర ప్రమాదకారులు దీనిని ఎక్కువగా వాడుతున్నారని ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. నేరపూరిత నెట్వర్క్‌లు, తీవ్రవాద గ్రూపుల ద్వారా టెలిగ్రామ్ దుర్వినియోగం పెరుగుతోందని కేంద్రం వివరించింది. నీట్ వంటి లీకైన పరీక్ష పత్రాల వ్యాప్తి, సైబర్ మోసాలు, ఉగ్రవాద సంబంధిత ప్రచారం, బాలల లైంగికదోపిడీకి సంబంధించిన మెటీరియల్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలతో సహా అనేక రకాల చట్టవిరుద్ధ కార్యకలాపాలకు టెలిగ్రామ్ ఒక కీలక వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్ల ద్వారా ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్, తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. టెలిగ్రామ్‌లో ప్రైవసీ ఫీచర్ల ద్వారా నేరపూరిత నెట్వర్క్‌లను అధికారులు గుర్తించడం కష్టంగా మారిందని కేంద్రం తెలిపింది. టెలిగ్రామ్ ద్వారా నకిలీ అకౌంట్లు సృష్టించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తెలిపింది. ఆధార్ వివరాలు, మొబైల్ నెంబర్లు, వ్యక్తిగత సమాచారం వంటి డేటాను విక్రయించే బాట్లుకూడా టెలిగ్రామ్‌లో పనిచేస్తున్నాయని ఆరోపించింది. సైబర్ నేరాల కోసం మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల కొనుగోలు, అమ్మకాలు కూడా టెలిగ్రామ్ ద్వారా జరుగుతున్నా యని వెల్లడించింది. కొన్ని ఛానెళ్లు మాల్వేర్, హ్యాకింగ్ టూల్స్, భద్రతా వ్యవస్థల్ని తప్పించుకునే సాఫ్ట్‌వేర్‌లను వ్యాప్తి చేస్తున్నాయని కేంద్రంపేర్కొంది. కొన్ని ఆండ్రాయిడ్ యాప్‌లు టెలిగ్రామ్ కమాండ్ అండ్ కంట్రోల్ సర్వర్‌గా ఉపయోగించి యూజర్ల డేటాను దొంగిలిస్తున్నాయని తెలిపింది. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర కాపీరైట్ కంటెంట్‌ను అక్రమంగా వ్యాప్తి చేస్తున్నట్లు ఆరోపించిన కేంద్రం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లుకూడా కోర్టుకు వివరించింది.



## రష్యాపై ఉక్రెయిన్ భీకర డ్రోన్ దాడులు

**మాస్కో,జూన్ 18:** ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రోజు రోజుకు విస్తరిస్తోంది. తన సరిహద్దుల నుంచి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న మాస్కోను టార్గెట్‌గా చేసుకొని భీకర దాడులకు పాల్పడుతోంది. గత నెల రోజుల నుంచి ఉక్రెయిన్ రష్యాపై డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ప్రధానంగా చమురు శుద్ధి కర్మాగారాలు , ఇంధన సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుంటోంది. ఇదే క్రమంలో గురువారం రష్యా రాజధాని మాస్కోపై అతి పెద్ద డ్రోన్ దాడికి పాల్పడింది. మాస్కోలోని ఆయిల్ రిఫైనరీకి సమీపంలో దాడికి పాల్పడటం గమనార్హం. దీంతో అప్రమత్తమైన రష్యా అధికారులు మాస్కోలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలలో విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. డ్రోన్ దాడులను తిప్పికొట్టే క్రమంలో మాస్కో లోని అత్యంత రద్దీగా ఉండే షెరెమెటివో విమానాశ్రయం నుండి ప్రయాణికులను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనేక విమానాలను దారి మళ్లించారు. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్ దాడులు నిజమేనని దాదాపు 180 డ్రోన్లను మాస్కో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చి వేసినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా 500 డ్రోన్ల కూల్చివేసినట్లు వివరాలను వెల్లడించారు.

# సంక్షిప్త వార్తలు

## ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్టసభలు: పాక్ మంత్రి

**ఇస్లామాబాద్,జూన్ 18:** పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబుపేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు.

## బంగ్లాదేశ్‌లో శ్రీరాముడి విగ్రహనిర్మాణం నిలిపివేత

**ఢాకా,జూన్ 18:** బంగ్లాదేశ్‌లో మత సామరస్యానికి విఘాతం కలిగించే పరిణామం చోటుచేసుకుంది. దేశంలోనే అత్యంత ఎత్తైనదిగా నిర్మిస్తున్న 81 అడుగుల శ్రీరాముడి విగ్రహ నిర్మాణ పనులను, ఇస్లామిక్ ఛాందసవాద గ్రూపుల నుంచి బెదిరింపులు రావడంతో నిలిపివేశారు. ఈ పరిణామాలపై హిందూ మైనారిటీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలకు దిగాయి. ఫలితంగా అక్కడ మైనారిటీల భద్రతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. ఉత్తర బంగ్లాదేశ్‌లోని గైబంధా జిల్లా, పలాశ్‌బరి ఉపజిల్లాలో ఉన్న శ్రీశ్రీ రాధా గోవింద, కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం నిర్మాణం పూర్తయింది. శుక్రవారం ప్రార్థనల అనంతరం కొన్ని రాడికల్ గ్రూపులు శ్రీరాముడి చిత్రపటాలపై బూట్లు విసురుతూ, నిర్మాణాన్ని బుల్డోజర్‌తో కూల్చివేస్తామని బెదిరించినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ బెదిరింపులతో భయాందోళనకు గురయ్యామని, అందుకే పనులు నిలిపివేసినట్లు ఆలయ అధ్యక్షుడు హరిదాస్ చంద్ర దాస్ తెలిపారు.

## బ్రహ్మపుత్రపై చైనా భారీప్రాజెక్టు

**న్యూఢిల్లీ,జూన్ 18:** భారత్‌కు ఎంతో కీలకమైన బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలోనే మెగా డ్యామ్ నిర్మించడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. టిబెన్‌లోని యార్లుంగ్ సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై డ్యామ్ నిర్మాణ పనుల్ని చైనా వేగం చేసింది. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణ, జలవనరుల, వ్యూహాత్మక భద్రతపై ప్రభావం పడొచ్చని భారత్ భయపడుతోంది. యార్లుంగ్ సాంగ్పో టిబెట్‌లో పుట్టి, అరుణాచల్ ప్రదేశ్‌లోకి సియాంగా నదిగా ప్రవేశించి, ఆ తర్వాత అస్సాంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. ఇప్పుడు డ్రాగన్ కంట్రీ చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల భారత ప్రయోజనాలకు భగం కలిగే అవకాశం ఉంది. చైనా నిర్మిస్తున్న భారీ డ్యామ్ వల్ల నది సహజ ప్రవాహంలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. చైనా తనకు కావాల్సిన సమయంలో నది ప్రవాహాన్ని ఒక ఆయుధంగా భారత్‌పై వాడే అవకాశాలు లేకపోలేదు. దిగువ ప్రాంతాల్లో వరదలు లేదా కరువు పరిస్థితుల్ని సృష్టించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నదీ ప్రవాహంపై చైనా పట్టు సాధిస్తే, ఎప్పుడైనా రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు ఏర్పడితే, ఈ నీటి ద్వారా భారత్‌ను నష్టపరిచే అవకాశాలు ఉన్నాయి.

## మమతా బెనర్జీకి కోల్‌కత్తా హైకోర్టు షాక్

**కోల్‌కత్తా,జూన్ 18:** టిఎంసి అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టిఎంసి రెబల్ నేత రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థిస్తూ ఇప్పటికిప్పుడు ఈ అంశంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణారావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. టిఎంసికి చెందిన ఎమ్మెల్యేలు చాలా మంది మమతకు, పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సంగతి తెలిసిందే. 64 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, తమ పార్టీ తరఫున రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని బెంగాల్ స్పీకర్ రతింద్ర బోస్‌ను కోరారు. 90 మంది ఎమ్మెల్యేల్లో 64 మంది ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో ఆయననే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# చెలి

## జుట్టుకి ముల్తానీ మాస్క్!



తక్కువ ఖర్చుతో తొందరగా తాజా మెరుపుని పొందాలంటే మనందరి మొదటి ఎంపిక ముల్తానీ మట్టే. దీన్ని ఎక్కువగా ముఖానికి మాస్క వేసుకునేందుకు వాడతారనే తెలుసు. కానీ ఇది జుట్టుకీ బోలెడన్ని ప్రయోజనాలు ఇస్తుందట.

★. ముల్తానీ మట్టి జుట్టకి ఉన్న మురికినీ, చుండ్రునీ వదలిస్తుంది. మాడుపై అదనంగా విడుదలయ్యే నూనెల్ని నియంత్రిస్తుంది. కండిషనర్‌గా పనిచేసి కురులను మృదువుగా, మెరిసేలా చేస్తుంది. ఇందుకు ముల్తానీ మట్టి, బియ్యప్పిండి సమాన భాగాలుగా తీసుకుని కప్పు పెరుగు, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి మెత్తని పేస్టులా చేయాలి. దీన్ని మాడు నుంచి చివర్లకు పట్టించాలి. అరగంటాగి గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి.

★ నాలుగుచెంచాల మల్తానీ మట్టికి రెండుచెంచాల నిమ్మరసం, చెంచా పెరుగు చేర్చి పేస్ట్‌లా చేయాలి. దీనినన కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంటాగి రసాయనాలు లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. కురులు నిగనిగలాడతాయి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు చుండ్రుని తగ్గిస్తాయి. □

## ఒత్తిడి ఎక్కువ అయిందా ?

బరువు పెరిగితే ఎక్కువ తినే స్తున్నామేమో అన్న కంగారు. నిద్ర పట్టక పోతుంటే ముందే మెనో పాజ్ వస్తోందేమో అన్న భయం, గాయాలు మానకపోతే మధు మేహమేమో ఇలా అనుమానించు కుంటూ పోతుంటాం. అయితే ఒత్తిడి కలిగించే హార్మోను పెరిగిందేమో గమనించుకోవాలి.

మెటబాలవజం సరిగా ఉండాలన్నా.. రక్తంలో చక్కెరలు, హార్మోన్ల స్థాయుల్లో సమన్వయం జరగాలన్నా కాస్త ఒత్తిడి మంచిదే. అంటే దానికి కారణమయ్యే కార్టిసాల్ కొద్దిస్థాయుల్లో విడుదలైతే ఆరోగ్యమే. అది హద్దు దాటితేనే అనారోగ్యం పొట్ట పెరిగిపోతోంది. దుస్తుల్లోంచి కనిపిస్తోందంటూ తెగ ఇబ్బంది పడిపోతాం కదా! అది పెరుగుతూ వస్తోన్నా అనుమానించాల్సిందే. ఒత్తిడితో తెలియకుండానే స్వీట్లు, చిరుతిళ్లవైపు ఆకర్షితులం అవుతాం. అదేమో బరువు పెరగడానికి కారణమవుతుంది. ఒత్తిడి పెరిగేకొద్దీ శరీరంలో నిల్వ ఉండే గ్లూకోజు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అదీ పొట్ట దగ్గర కొవ్వుగా



చేరుతుందట. రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం పట్టినా పదే పదే మెలకువ రావడమూ కార్టిసాల్ పెరగడానికి సూచనలే. పదే పదే ముఖం వాయడం, నీరు చేరినట్లుగా అనిపించినా తేలిగ్గా తీసుకోవద్దు. అంతెందుకు శరీరంపై ఏవైనా గాయాలైతే కొన్ని రోజుల్లో మానడం మామూలే. గాయం తీవ్రతను బట్టి నయమయ్యే సమయంలో మార్పు ఉంటుంది. చిన్నచిన్నవీ తగ్గడం లేదంటే దానికి కారణమయ్యే సైటోకైన్స్ సరిగా పనిచేయడం లేదని అర్థం పెరిగిన ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తి సైటోకైన్స్ పనితీరుకు అడ్డుపడి, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమవు తాయి. తిండి పడలేదు, జీర్ణవ్యవస్థలో ఏదో ఇబ్బంది.. గ్యాస్ పదే పదే పలకరిస్తోంటే మనం చెప్పుకొనే కారణాలే ఇవి. కొన్నిసార్లు నెలసరి రాబోతోందని సర్దిపుచ్చుకుంటాం కూడా. కానీ అతి ఒత్తిడి కూడా జీర్ణప్రక్రియపై ప్రభావం చూపుతుంది. □

## లాలి పాటలే బుజ్జాయికి తొలి పాఠం



బిడ్డ పుట్టగానే బాధ్యత తీసుకుంటుంది అమ్మ. ఆ బుజ్జాయిని గొప్ప మనిషిగా తీర్చిదిద్ది, ఈ లోకానికి అందించే వరకూ ఆమె విశ్రమించదు. ఆ ప్రయాణంలో ప్రతి అడుగూ ఓ అద్భుతమే! అందుకే తల్లీబిడ్డల మధ్య బంధం పరిశోధకులకి ఓ హాట్ టాపిక్! అలా ఈమధ్య జరిగిన ఓ పరిశోధనలో, తల్లి లాలిపాట కూడా చిన్నారి ఎదుగుదల మీద గొప్ప ప్రభావం చూపుతుందని తేలింది. ప్రాంతానికీ, భాషకీ అతీతంగా ప్రపంచంలోని ప్రతి తల్లీ తన బిడ్డని పాటతో లాలిస్తుంది. అసలు సంగీతం లాలిపాటతోనే మొదలైందని అంటారు. ప్రపంచంలో బెస్ట్‌సింగర్ తల్లే అని ఒప్పుకొంటారు. అందుకే మియామీ యూనివర్సిటీ పరిశోధకులు చిన్నారుల మీద తల్లి లాలిపాట ప్రభావం గురించి పరిశోధించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం వారు 70 మంది పసిపిల్లలని గమనించారు. తల్లి లాలిపాట పాడుతున్నప్పుడు వారి మానసిక స్థితినీ, వేరే సంగీతం వింటున్నప్పుడు వారి ఉద్వేగాలనీ పరిశీలించారు. లయబద్ధంగా, ప్రేమగా సాగే లాలిపాటని వినగానే పిల్లల్లో అలజడి సద్దుమణిగి పోతున్నట్లు తేలింది. లాలిపాట పాడుతున్నప్పుడు బుజ్జాయి తల్లి వంకే చూస్తుంటుంది. ఆ చిన్నారి స్పందనలకు అనుగుణంగా తల్లి కూడా, పాటలోని లయని మారుస్తూ ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్యా గొప్ప అనుబంధం ఏర్పడుతున్నట్లు గమనించారు. లాలిపాటతో పిల్లలు శబ్దాలను కూడా సులువుగా గ్రహించగలుగుతున్నారట. అలా లాలిపాట పిల్లవాడికి భాషని కూడా పరిచయం చేస్తున్నదన్న మాట. లాలిపాట పాడుతూ చిన్నారితో గడపడం వల్ల తల్లి మనసు కూడా ప్రశాంతత పొందుతున్నట్లు తేలింది. చాలామంది తల్లులు డెలివరీ తర్వాత, శరీరంలోని హార్మోన్ల మార్పులతో డిప్రెషన్‌కు లోనవుతారు. దీన్నే అంటారు తల్లిలో ఏర్పడే ఈ నిరాశ నుంచి దృష్టి మళ్లించేందుకు లాలిపాట మందులా పనిచేస్తుందట. అంటే అమ్మ తనని తాను సంబాళించుకుంటూ, బుజ్జాయికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్నమాట. □

## భావోద్వేగాలను పరిశుద్ధ పరచుకున్నవాడే..

మనిషి సకల కార్యకలాపాలూ ఒక్క మనస్సు నుండే జరుగుతాయి. అదొక్కటీ పరిశుద్ధమైతే సకల కర్మలూ సత్కర్మల్గు అవుతాయి, లేకపోతే 'దుష్కర్మలు' అవు తాయి. అందుకే యావత్ ధర్మశాస్త్రాలు మనో పరి శుద్ధతకే పెద్దపీట వేస్తున్నాయి. ఆత్మశుద్ధే ధర్మాల అంతిమ లక్ష్యం. మనస్సును జయించినవాడికి అది మిత్రుడు, లేనిచో శత్రువు అని భగవద్గీత (6:6); హృదయశుద్ధి గలవారు దేవుని చూచెదరని పరిశుద్ధ బైబిలు (మత్తయి 5:8); మనస్సును పరిశుద్ధం చేసు కున్న వ్యక్తి నిస్సందేహంగా సాఫల్యం పొందుతాడని ఖురాను (87:14) ప్రకటిస్తున్నాయి. దీనిని బట్టి మనో పరిశుద్ధతకి ధర్మ గ్రంథాల్లో ఎంతటి ప్రాధా న్యత ఉందో అర్థం చేసు కోవచ్చు. మనిషిలో శారీరక దారుఢ్యం, మేధాసంపత్తి, లలితకళలు, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం వంటి ఎన్నో విశేషాలు, శక్తిసామర్థ్యాలు ఉండవచ్చు. కానీ ప్రజల్లో హృదయపూర్వకమైన గౌరవ స్థానం ఏర్పడేది మాత్రం అతడు కలిగి ఉండే సౌశీల్యత అనే నైతిక, మానవీయ 'కౌసల్యము'ను బట్టే. ఈ సౌశీల్యతకు కేంద్ర స్థానం మనసే. భౌతిక వ్యవసాయం – నైతిక వ్యవసాయం! భౌతిక మనుగడకు వ్యవసాయ క్షేత్రంలో మేలు చేసే పంట మొక్కలను పోషిస్తూ, కీడు చేసే 'కలుపు మొక్కలను' ఎప్పటికప్పుడు తుంచి వేయడం ఎంత ప్రకృతి సహజమో, నైతిక మనుగడకు 'మనో క్షేత్రం'లో నైతిక వ్యవసాయం చేయడం అంత తప్పనిసరి. దీనినే సెక్యులర్ పరిభాషలో 'నైతిక మార్గం' అని, ఆధ్యాత్మిక పరి భాషలో 'భక్తి మార్గం' అని అంటారు. ఈ పనులలో ఏ ఒక్కటి విడనాడినా మనిషి నైతిక మనుగడ నాశనం కాక తప్పదు. మన మనో క్షేత్రంలో వినయం, నమ్రత, శాంతి, మైత్రి, క్షమాశీలత వంటి అనుకూల భావోద్వే గాల సాగు చేస్తున్నప్పుడు...అహంకారం, గర్వం, ఈర్ష్యా సూయలు, కోపం, పగ, ప్రతీకారం వంటి ప్రతికూల భావోద్వేగాల కలుపు మొక్కలు ఏపుగా పెరిగి పోతుంటాయి. అది ప్రకృతి సిద్ధం, దానిని అసలే మొలవకుండా నివారించడం అసాధ్యం. కాబట్టి, ఆ కలుపు మొక్కలు బలపడకుండా మొగ్గలోనే తుంచి పారేస్తూ, మనో క్షేత్రాన్ని ఎప్పటికప్పుడు పరిశుద్ధం చేస్తూ సాగడమే మనిషి సాఫల్యానికి ఏకైక వ...

**ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

## వాడిన పూలతో..



దేవుడికో, జడలోనో అలంకరించేస్తాం. తర్వాత వాటిని వ్యర్థంగా భావించి తీసి బయట పారేస్తాం. కానీ, వీటితో బోలెడు ప్రయోజనాలున్నాయి. పండగల్లో అలంకరణలోనూ ఎక్కువగానే వాడతాం. అవి కాస్తా ఎండిపోయాక తీసి పారేయకండి. వీటితో ఇంట్లోకి దోమలు, కీటకాలు రాకుండా చేయొచ్చు. ఇందుకోసం మిక్సీ జార్‌లోకి గుప్పెడు బంతి పూల రేకల్ని తీసుకుని, అందులో కాస్త బేకింగ్ సోడా, మూడు వెల్లుల్లి రెబ్బలు, కొన్ని నీళ్లు కూడా చేర్చి మెత్తగా రుబ్బుకోవాలి. దీన్ని వడకట్టి ఓ స్ప్రే సీసాలోకి నింపి ఉదయం, సాయంత్రం కిటికీలూ, మూలల్లో చల్లితే సరి. లోపలకేవీ రావు. అందమైన గులాబీలు వాడి పోయాక పరేయొద్దు. వీటిని రేకలుగా విడదీసి, కాస్త మైనం కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. దీనికి రెండు చుక్కల రోజ్ ఆయిల్‌ని చల్లి ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో పోసి మధ్యలో దారం ఉంచాలి. ఆపై దాన్ని రోజంతా ఫ్రిజ్‌లో ఉంచితే సరి. దీన్ని వెలిగిస్తే ఇల్లంతా వెలుగులు నిండడమే కాదు. సువాసనా వెదజ ల్లుతుంది. అలానే మల్లె, సంపంగి వంటి సువాసన ఇచ్చే పూలలో కొద్దిగా రోజ్ వాటర్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి అందులో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ వేసి గదిలో స్ప్రే చేసుకుంటే తాజా అనుభూతి కలుగుతుంది. □

## పోషకాల అవిసెలు..



**చాక్లెట్లు నుంచి ఓట్‌మీల్ వరకు అన్ని రకాల ఆహారపదార్థాల్లో అవిసెలు కనిపిస్తున్నాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లూ, లిగ్నన్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే వీటిని, మహిళలు రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల, హృదయ సంబంధిత, రుతుక్రమ, క్యాన్సర్‌లకు సంబంధించిన వ్యాధులన తగ్గిస్తాయని టొరంటో విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది.**

అవిసెలు మహిళల్లో వచ్చే రొమ్ముక్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్లు రాకుండా నివారిస్తాయని కెనడా న్యూట్రిషన్ కౌన్సిల్ పేర్కొంది. వీటిల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు క్యాన్సర్ కణతుల్ని పెరగకుండా నియంత్రి స్తాయి. యుక్తవయసు వారిలో క్యాన్సర్ వచ్చిన వారుంటే రోజూ ఆహారంలో అవిసెలను తీసు కోవడంవల్ల వీటిలో ఉండే లిగ్నన్లు క్యాన్సర్ కణాలతో పోరాడి, వృద్ధి చెందకుండా కాపాడతాయి. రుతు క్రమం ఆగిన మహిళలల్లోనే హృద్రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువున్నాయని తెలిసింది. ఇందుకోసం కొంతమంది మహిళలకు సంవత్సర కాలంపాటు రోజూ నాలుగు చెంచాల అవిసెగింజలు ఇచ్చారు. వీటిలో ఉండే లిగ్నన్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడమే కాకుండి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకోకుండా కాపాడాయి. అంతేకాదు రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయని తేలింది. టైప్-2 డయాబెటిస్ మెరుగుపడింది. ప్రసవానంతరం లేదా నెలసరి ఆగిన మహిళల్లో అరికాళ్లూ, చేతులూ మంట పెడుతుంటాయి. పరిశోధనలో భాగంగా కొంతమంది మహిళలకు రోజూ రెండు చెంచాల అవిసెలు, తృణధాన్యాలను పెరుగు, సలాడ్లు, జ్యూస్‌ల్లో కలిపి ఇచ్చారట. వారం రోజుల్లోనే 57 శాతానికి అరికాళ్ల మంటలు తగ్గినట్లు వారు గమనించారు. □

# తెర

## 'వెంకట్రామయ్య గారి తాలూకా' జులై లో విడుదల



దినేష్ కుమార్ హీరోగా, దివిజ ప్రభాకర్ (ప్రభాకర్ కుమార్తె) హీరోయిన్‌గా మురళీధర్ గౌడ్, సుధ టైటిల్ పాత్రలలో సతీష్ ఆవాల దర్శకత్వం లో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్ర నిర్మాత కోమలి మాట్లాడుతూ... నేను కోమలి ఫోక్ సింగర్‌గా నా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టంతో నేను సినిమా తీయాలి అని ఒక ధ్యేయంతో చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రాన్ని పూర్తి చేసాము. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ..మా 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేసి ఆఫిషియల్ ప్రెస్ మీట్ పెట్టి అనౌన్స్ చేస్తాము. మా కథ విషయానికోస్తే అందమైన ఒక పల్లెటూరులో వెంకట్రామయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బుతో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా. 'వెంకట్రామయ్య గారి తాలూకా' మంచి ఫ్యామిలీ డ్రామాని కుటుంబం తో కలిసి థియేటర్ కి వెళ్లి హాయిగా ఎంజాయ్ చేసేలా చిత్రాన్ని తెరకేకించాం అని దర్శకుడు సతీష్ ఆవాల తెలిపారు.

## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' క్లైమాక్స్ అద్భుతం: రాశీ సింగ్



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. ఈ మూవీతో కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌కి జోడిగా రాశీ సింగ్ నటించారు. చిత్రం జూన్ 19న రిలీజ్ కాబోతోంది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?..**

పక్కింటి అమ్మాయిలా నా పాత్ర ఉంటుంది. ఎంతో సహజంగా అనిపిస్తుంది. విత్ అవుట్ మేకప్ నటించాను.

**వడ్డే నవీన్ నుంచి ఏమైనా తెలుసుకున్నారా?..**

వడ్డే నవీన్ గారితో సినిమా అని తెలిశాక చాలా వరకు ఆయన గురించి రీసెర్చ్ చేశాను. ఆయన నటించిన ఎన్నో చిత్రాల గురించి తెలుసుకున్నాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'చిత్రంలో మీ పాత్ర ఎలాంటి టర్నింగ్ పాయింట్‌లా ఉంటుంది?..**

భర్తకు ప్రతీ విషయంలో సపోర్ట్‌గా ఉండే ఓ చక్కటి గృహిణిగా లక్ష్మీ పాత్ర ఉంటుంది. నేను రియల్ లైఫ్‌లో కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటాను. లక్ష్మీ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?..**

కమల్ గారికి ఫుల్ క్లారిటీ ఉంటుంది. ఆయనకు ఏం కావాలో అది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. లక్ష్మీ ఎలా ఉండాలో.. అలానే ఉండాలని ఆయన చెబుతుంటారు. కొంచెం అటూ ఇటూ కూడా కావొద్దు అని ఆయన అంటుంటారు.

**రెస్టారెంట్ బిజినెస్ ఎలా నడుస్తోంది?..**

రెస్టారెంట్ బిజినెస్ అద్భుతంగా నడుస్తోంది. వడ్డే నవీన్ గారు కూడా నా వ్యాపకాల గురించి అడిగేవారు. నాకున్న రెస్టారెంట్, కెఫె వ్యాపారాల గురించి చెప్తే ఆశ్చర్యపోయారు.

**మీకు ఏ రంగంలో కంఫర్ట్‌గా అనిపిస్తుంది?..**

నాకు సినిమాలు, వ్యాపారాలు రెండూ ఇష్టం. నేను ఇంకా ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఇదంతా కూడా నథింగ్. 14 ఏళ్లకే మోడలింగ్ స్టార్ట్ చేశా. ఛత్తీస్ ఘడ్‌లోని భిలాయ్ నుంచి వచ్చాను. మిస్ చత్తీస్ ఘడ్

## #VenkyAnil5 & # NkrAR2 ఘనంగా ప్రారంభం



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, 'హిట్ మెషీన్' అనిల్ రావిపూడి కలిసి ఒక పూర్తి స్థాయి పండుగ వినోదాత్మక చిత్రం (#VenkyAnil5 & # NkrAR2) అందించడానికి సిద్ధమవుతు న్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం, పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ఓపెనింగ్ షాట్‌కు దర్శకత్వం వహించారు. #VenkyAnil5 & # NkrAR2 చిత్రం అనిల్ రావిపూడి స్టయిల్ లో సాగే వినోదం, నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబో ఈ ప్రాజెక్ట్‌కు మరింత ఎట్రాక్షన్ జోడించడంతో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగ చిత్రాలలో ఒకటిగా ఇది నిలుస్తోంది. అనిల్ రావిపూడికి ఉన్న అద్భుతమైన బ్లాక్‌బస్టర్ ట్రాక్ రికార్డ్, స్టార్స్ కలయిక, పరిశ్రమలోని ప్రముఖ నిర్మాణ సంస్థల మద్దతు కారణంగా ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## 27న 'కన్నప్ప' రీ రిలీజ్



డైనమిక్ హీరో విష్ణు మంచు గత ఏడాది 'కన్నప్ప' అంటూ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద 'కన్నప్ప' మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది గొప్ప నటీ నటులు కీలక పాత్రలను పోషించడంతో ప్యాన్ ఇండియా వైడ్‌గా క్రేజ్‌ను దక్కించుకుంది. 'కన్నప్ప' సినిమాకి తెలుగులో వచ్చిన ఆదరణ, క్లైమాక్స్‌లో విష్ణు నటనకు వచ్చిన ప్రశంసల గురించి అందరికీ తెలిసిందే. మరోసారి ఈ విజువల్ వండర్‌ను ఆడియెన్స్‌కి అందించేందుకు విష్ణు మంచు రెడీ అయ్యారు. సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న 'కన్నప్ప'ని లిమిటెడ్ స్క్రీన్‌లలో రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు విడుదల చేసిన రీ రిలీజ్ డేట్ పోస్టర్ వైరల్ అవుతోంది.

## 'కళాంకి భైరవుడు' టీజర్ లాంచ్



కళాంకి భైరవుడు ఓ విభిన్నమైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్. చేతబడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో జరిగిన కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. దర్శకుడు హరి హారన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గాయత్రీ ప్రొడక్షన్స్, రచ్చుమల్ల బ్రదర్స్ బ్యానర్లపై కె.ఎన్. రావు, డా. రచ్చుమల్ల శ్రీనివాస రావు నిర్మించిన ఈ చిత్రానికి పి.ఆర్. సంగీతం అందించారు. ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ ప్రధాన పాత్రలో నటించగా, రితిక, పూజ కిరణ్, భవ్యశ్రీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీజర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా దర్శకుడు సాయి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ..సాయి రాజేష్ మాట్లాడుతూ,..ప్రతి శుక్రవారం బాక్సాఫీస్ వద్ద పోటీ, సవాళ్లు ఉంటాయి. నా తొలి చిత్రం హృదయ కాలేయం రోజులలో గెస్ట్ కోసం వెతికిన సందర్భాలు గుర్తొస్తున్నాయి. ఇదే వేదికపై బేబీ టీజర్, చెన్నై లవ్ స్టోరీ టీజర్‌లను కూడా విడుదల చేశాం. ..హీరోయిన్ రితిక మాట్లాడుతూ,.. ముందుగా మా టీజర్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసి మాకు అండగా నిలిచిన సాయి రాజేష్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. హీరో రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ,.. మా చిన్న సినిమాకు మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన దర్శకుడు సాయిరాజేష్‌కి, అలాగే మీడియా మిత్రులందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. హీరోయిన్ భవ్యశ్రీ మాట్లాడుతూ,.. ముందుగా మీడియా మిత్రులకు, ప్రేక్షకులకు, అలాగే మా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి రాజేష్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మా టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ..నిర్మాత రీ.వి రావు మాట్లాడుతూ,.. మా చిత్రానికి మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, మీడియా మిత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. దర్శకుడు హరిహరన్ లేకపోతే ఈ సినిమా రూపుదిద్దుకునేది కాదు. ఆయన విజన్, కృషి వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది. కళాంకి భైరవుడు చిత్రం చేతబడులు,

## 'కామ్రేడ్ కళ్యాణ్' ఫస్ట్ సింగిల్ 20న రిలీజ్



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్‌మెంట్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తున్నారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే శ్రీవిష్ణు తన లేటెస్ట్ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'కామ్రేడ్ కల్యాణ్'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.